J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 4 28.06.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఒంటరితనమే ఓడించింది!



## కొంప ముంచిన కార్పొరేట్ పరిపాలన
## తప్పుదోవ పట్టించిన భజన బృందం
## దగా చేసిన సీఈఓ(సలహాదారు)ల వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓటమిపై ఆ పార్టీ శ్రేణులలో ఇంకా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చి నెలరోజులు పూర్తికావొస్తున్నప్పటికి రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రశ్నలు వినపడుతూనే ఉన్నాయి. ఖచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరితనమే ఆయన ఘోరంగా ఓడిపోవడానికి కారణమని చెప్పడానికి సందేహమే అవసరం లేదు. **2014**, ఆ తరువాత **2019**, మళ్ళీ **2024** సంవత్సరాలలో జరిగిన ఎన్నికల సరళిని, వచ్చిన ఫలితాలని ఒక్కసారి గమనిస్తే వైసీపీ శ్రేణుల అనుమానాలకి, ప్రశ్నలకి సమాధానాలు లభిస్తాయి.

### 2014 ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డికి...

- జగన్ వై.ఎస్. కుమారుడన్న సానుభూతి ఉండింది.
- పాపం అకారణంగా జగన్ జైలుకి వెళ్ళొచ్చాడన్న జాలి, దయ ఆయనపైన ప్రజలు చూపించారు.
- తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల జగన్‌కి తోడుగా ప్రజాక్షేత్రంలో తిరిగారు.
- రాజశేఖరరెడ్డి అనుచర గణమంతా జగన్ కోసం పనిచేశారు.
- తాను ఖచ్చితంగా గెలవబోతున్నానన్న ధీమా జగన్‌లో ఉండేది.
- అయినా ఆ ఎన్నికలలో జగన్ కేవలం 67 సీట్లకే పరిమితమై ఓటమిపాలయ్యాడు.

10లో



## ఆ మేడలు చూసి వైసీపీ శ్రేణులు సైతం..
# అవాక్కయ్యారా!

గడిచిన అయిదేళ్ళ కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రభుత్వ పరంగా ఎలాంటి శాశ్వత నిర్మాణాలూ చేపట్టలేదు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క నీటిపారుదల ప్రాజెక్టు కూడా నిర్మించలేదు. పోలవరం పూర్తిచేయలేదు. ఒక్క ప్రధాన రహదారినీ బాగు చేయలేదు. ప్రభుత్వం నడపడానికి ఒక శాశ్వత సచివాలయం లేదు.

10లో



# మంత్రి సత్యకుమార్‌కు.. ఎన్జీఓ నేతల శుభాకాంక్షలు



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను తాడేపల్లి లోని ఆయన కార్యాలయంలో ఈ నెల 24న జిల్లా ఎన్జీఓల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు జి.రామకృష్ణ, సతీష్ తదితరులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల వినతి :

పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 24న జిల్లా ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మంత్రి సత్యకుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎం.గిరీష్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 29న జడ్పీ సమావేశాలు

ఈనెల 29న నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి స్థానిక జడ్పీ కార్యాలయంలో సమావేశాలుంటాయని, జడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని జడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పోలంరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పదవిని అధిష్టించిన నేపథ్యంలో, ఈనెల 22న కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు.. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించి, శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీ చాముండేశ్వరి అమ్మవారి

# కల్యాణోత్సవం



ఇందుకూరుపేట మండలం గంగ పట్నంలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఈనెల 22న అమ్మవారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరి గింది. వేదపండితుడు మడమనూరు మల్లికార్జున గురుకుల్ నేతృత్వంలో తొలుత అమ్మవారిని శోభాయమానంగా అలంక రించి పూజలు చేసి, సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించు కుని తరించారు.

## మాలకొండకు వెళ్ళి..

# మొక్కు తీర్చుకున్న గ్రామస్తులు



కందుకూరు నియోజకవర్గం ఎమ్మె ల్యేగా తమ నాయకుడు ఇంటూరి నాగే శ్వరరావు గెలిస్తే మాలకొండకు వస్తామని మొక్కుకున్న లింగసముద్రం మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామస్తులు, ఇంటూరి విజయంతో మాలకొండ శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయానికి ఈనెల 22న పాద యాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకున్నారు.

## వేద విజ్ఞాన వేదిక నేతృత్వంలో..

# 30న సాహిత్యోపన్యాసం

చెన్నైలో ఉన్న 'వేద విజ్ఞాన వేదిక' ఈనెల 30వ తేదిన తమ సంస్థ ద్వారా 150వ ఉపన్యాస ధారావాహిక కార్యక్ర మాన్ని ఏర్పాటు చేస్తోంది. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ముంబైకి చెందిన ప్రముఖ సారస్వతోప న్యాసకులు సాంప్రతి సురేంద్రనాథ్ 'సాహిత్యము-చమత్కార వైభవము' అనే అంశంపై ఉపన్యసిస్తారని, సాహిత్యాభి మానులందరూ పాల్గొనాలని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామంలోని హైస్కూల్‌లో మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం. ప్రమీల పాల్గొని సుమారు 150 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఆలంబన ఫౌండేషన్, పలువురు దాతల సహకా రంతో రోగులకు మందులు పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు కామిరెడ్డి అశోక్, అల్లంపాటి ధనుంజయరెడ్డి, కోలా హజరత్తయ్య, మోహన్, బివిఎస్ఆర్ ఆసు పత్రి సిబ్బంది పాల్గొన్నారు.






# మన వెంకయ్య ఇంట ప్రధాని

దేశ ప్రధానిగా మూడోసారి పదవీ స్వీకార ప్రమాణం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోడీ, ఇటీవల భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఢిల్లీలోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. దేశ పురోభివృద్ధి కోసం దశాబ్దాల తరబడి కృషి చేసిన వెంకయ్యనాయుడుతో కలసి పనిచేయడం తనకో గొప్ప అవకాశమని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు సుపరిపాలన అందించాలి

**• అధికారులతో మంత్రి నారాయణ**



ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 27వ తేది గురువారం ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లాకలెక్టర్ హరినారాయణన్‌తో కలసి అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని వివిధ అభివృద్ధి పనుల విషయాన్ని ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఇళ్ళ నిర్మాణాల పురోగతి గురించి తెలుసుకున్న మంత్రి, లే-అవుట్‌లలో మౌలిక వసతులు కల్పిస్తేనే ప్రజలు ముందుకువచ్చి ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకుంటారన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలు పూర్తిచేసేందుకు ఏమేమి చర్యలు చేపట్టాలో త్వరలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ సమీక్ష సందర్భంగా, ప్రస్తుతం అమల్లో ఉన్న బార్ లైసెన్సింగ్ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నుడా పరిధిలో కొత్తగా లే అవుట్లు వేసే వ్యాపారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఎవ్వరినీ ఇబ్బందిపెట్టే విధంగా తమ చర్యలు ఉండవని మంత్రి స్పష్టం చేశారు.



### జొన్నవాడ దేవస్థానం ఈఓగా...

# అరవభూమి శ్రీనివాసులరెడ్డి

జిల్లాలో వివిధ అమ్మవారి దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా పనిచేసి ఆయా ఆలయాల అభివృద్ధికి కృషిచేసిన అరవభూమి శ్రీనివాసులరెడ్డిని రాష్ట్ర దేవాదాయశాఖ జొన్నవాడ కామాక్షమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా నియమించింది. ప్రస్తుతం వెంకటగిరి పోలేరమ్మ గుడి ఈఓగా వున్న శీనయ్యకి జొన్నవాడ దేవస్థాన ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలని అప్పగించి నియమించింది.

# కంటి ఆపరేషన్ల కోసం.. 'పొన్నలూరు' విరాళం



తమ కుమారుడు పొన్నలూరు వినయ్ రాఘవ్ జన్మదినం సందర్భంగా, ఇటీవల ఆయన తల్లితండ్రులు పొన్నలూరు సీతా రామిరెడ్డి, జ్యోతిరెడ్డి నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ పథకం కోసం 50వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, డెప్యూటీ మేనేజర్ వెంకటేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు. ఆ మొత్తంతో 25 మంది పేదవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశామని, ఆపరేషన్ చేయించు కొన్నవారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశామని జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వినయ్‌రాఘవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ, విరాళం అందజేసిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు..

# ఎంపీ వేమిరెడ్డి అభినందనలు



18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఈనెల 26వతేదీ బుధవారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలో లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లా రెండవసారి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లోని స్పీకర్ చాంబర్‌లో ఓంబిర్లాను కలిసిన ఎంపీ వేమిరెడ్డి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కలసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఎంతో అనుభవం ఉన్న ఓంబిర్లా స్పీకర్‌గా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. సభ సజావుగా, సమర్థవంతంగా నడిపేందుకు తప్పకుండా ఆయన కృషి చేస్తారని ఆకాంక్షించారు.



# ప్రధాని మోడీతో భేటీ అయిన టీడీపీ ఎంపీలు

దేశ ప్రధాని నరేంద్ర మోడీతో టీడీపీ ఎంపీలు, కేంద్రమంత్రులు ఈనెల 26న ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఎంపీలతో ప్రధాని మోడీ చర్చించారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరు, లోక్‌సభ స్పీకర్ ఎన్నికపై వారు మాట్లాడారు. భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి టీడీపీ ఎంపీలు శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి శాలువాతో సత్కరించారు.

# ఆత్మీయ అభినందనలు





రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని, సర్వేపల్లి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలను అభినందిస్తున్న 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).




లాయర్
జూన్ 28, 2024

# సమస్యల సవాళ్ళు.. యువత భవితకు ఉరితాళ్ళు

'మనసు అద్దం లాంటిది. మనం నవ్వితే నవ్వుతుంది. ఏడిస్తే ఏడుస్తుంది. మనసును ప్రశాంతంగా, ఆనందంగా ఉంచుకోవడం అంతా మన చేతుల్లో ఉంటుంది' అని పెద్దలు అప్పుడప్పుడూ ధైర్యం కోసం చెప్తుంటారు కానీ, ఆచరణలో అందరికీ అది సాధ్యం కావడం లేదు. ముఖ్యంగా మనదేశంలోని యువత చిన్నచిన్న మానసిక సమస్యలను సైతం అధిగమించే పరిస్థితి లేక నానాటికీ బలహీనమవుతోంది. ఎంతటి విషమ సమస్యలు ఎదురైనా ధీరోదాత్తంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలనే తత్వం యువతలో నానాటికీ కొరవడుతోంది. దీంతో వారి జీవితాలు అంధకారబంధురంగా ఉంటున్నాయి. అటు సామాజికంగా, ఇటు మానసికంగా అనేక రకాలైన సమస్యలు యువత భవితకు ఉరితాళ్లుగా మారిపోతున్నాయి. సాధారణమైన విషయాలకు కూడా తట్టుకోలేక, మానసిక వేదనకు, క్షణికావేశానికి గురై ఎంతోమంది విద్యార్థులు, యుక్తవయసులో ఉన్నవారు ఆత్మహత్యల దారినే ఎంచుకుంటున్నారు. అలాంటి వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతూనే ఉండడం బాధాకరం. జాతీయ నేర గణాంకాల బ్యూరో లెక్కల్నిబట్టి చూసినా, మనదేశంలో 2022లో జరిగిన ఆత్మహత్యల్లో ఒక్క విద్యార్థులవే 7.6 శాతంగా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లమవుతోంది. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లోని సమస్యలు యువతీ యువకులను బాగా ప్రభావితం చేస్తున్నాయి. తెలిసీ తెలియని వయసులో ప్రేమ వ్యవహారాలు, వాటితో పెరిగే మానసిక వత్తిడులు యువత జీవితాలను అల్లకల్లోలంగా మారుస్తున్నాయి. సరిగా చదవలేకపోవడం, చదివినా పొరపాటునో గ్రహపాటునో పరీక్షల్లో పాసు కాలేకపోవడం, పోటీ పరీక్షల్లో ధీటుగా రాణించలేకపోవడం, ఆశించిన మార్కులు సాధించలేకపోవడం వంటివన్నీ యుక్తవయస్సులో ఉన్న విద్యార్థుల మనసులను బాగా కలవరానికి చేస్తున్నాయి. పరీక్షల్లో ఫెయిలైతేనే జీవితమంతా విఫలమైనట్లుగా మానసికంగా కుంగిపోయి ఎంతోమంది విద్యార్థులు బలవన్మరణాలతో తమ జీవితాలను కడతేర్చుకుంటున్నారు. తద్వారా, వారి తల్లితండ్రులకు జీవితాంతం తీరని వేదనను మిగిలిస్తున్నారు. మనదేశంలో 35 ఏళ్ళలోపు ఉన్న యువకులే దాదాపు 60శాతం మంది దాకా ఉన్నారు. ఏడాదికి సుమారు కోటిమంది దాకా వివిధ డిగ్రీలతో బయటికొచ్చి ఉద్యోగార్థులుగా ఉంటున్నారు. కానీ, ఉద్యోగాలు కొరవవుతుండడంతో యువత ఆశలు నీరుగారిపోతున్నాయి. ఫలితంగా ఆత్మహత్యలతో జీవితాలకు ముగింపు పలుకుతున్నవారు ఎంతోమంది. ఇకనైనా యువతలో ఆత్మస్థైర్యాన్ని కలిగించేందుకు, కష్టాలను అధిగమించి లక్ష్యాలను సాధించుకునేందుకు తగ్గ మానసిక దృఢత్వాన్ని కలిగించేందుకు ప్రభుత్వాలతో పాటు, అన్ని విద్యాసంస్థల వారు సంకల్పం చేసుకోవాలి. యువత ఇష్టపడే ఆహ్లాదకరమైన వాతావరణం, స్నేహభావాలతో వారిని ఆదరించడం, ఒకవేళ వారిలో ఏవైనా కలతలున్నా అవి సమసిపోయేలా వ్యవహరించడం, కుంగుబాటుతో కుంచించుకుపోకుండా ఎప్పటికప్పుడు వారి పరిస్థితులను గమనిస్తూ తల్లితండ్రులు వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడం అవసరం. విద్యార్థులకు నైతికవిద్యతో పాటు, సాంకేతిక నైపుణ్యవిద్యను బోధించాలి. పట్టుదల-క్రమశిక్షణతో జీవించడాన్ని అలవరుస్తూ జీవితంలో ఎదురయ్యే కష్టాల నుంచి ఎలా గట్టెక్కాలో కూడా సందర్భానుసారంగా బోధిస్తుండాలి. సమాజంలో ఏది మంచో, ఏది చెడో తెలియజెప్పాలి. ఎన్ని కష్టాలెదురైనా, ఎన్ని అపజయాలు కలిగినా..కుంగిపోకుండా..కష్టపడి విజయం సాధించి ఉన్నత శిఖరాలధిరోహించిన మహనీయుల జీవితాలను వారికి ఆదర్శంగా చూపాలి. ఈ విషయాల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కరదీపికల్లా ఉండాలి. మార్కులతో కాదు..రిమార్కు లేకుండా ఎలా బతకాలో వారికి తెలియజెప్పాలి. తమ సమస్యలను, కుటుంబంలోని కష్టాలను వారి మీద రుద్దకుండా..తమ బిడ్డలకు తల్లితండ్రులు దారిదీపాల్లా ఉంటూ వారి భవితకు మంచిమార్గాలు చూపాలి. అదేవిధంగా, దేశంలో విద్యార్థులు, యువతీ యువకుల ఆత్మహత్యలను నివారించే దిశగా విద్యారంగంలోనూ కేంద్ర-రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అవసరమైన మార్పులు తీసుకురావడం, వత్తిడి లేని విద్యావ్యవస్థకు రూపకల్పన చేయడం తక్షణావసరం. అలాంటి మేలైన కార్యాచరణలతో అటు ప్రభుత్వాలు, ఇటు విద్యాసంస్థలు కూడా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, ఎంతో జాగ్రత్తగా విద్యార్థి రంగాన్ని, యువత జీవితాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ధీరోదాత్తమైన యువశక్తితో సమాజాన్ని.. తద్వారా దేశాన్ని బలోపేతం చేసుకోవడం ఒక కర్తవ్యదీక్షగా కొనసాగాలి. అప్పుడే యువభారతం బలహీనం కాకుండా.. దేదీప్యమానమవుతుంది.




# రాజకీయ చట్రంలో 'జీరోక్రసీ'గా మారిన బ్యూరోక్రసీ

## అయ్యా 'ఎస్' అంటున్న... అ(తి)ధికారులు!

అఖిల భారత అధికార వ్యవస్థ అపఖ్యాతి పాలవుతోంది. రాజకీయ నాయకుల నీడలో వికృత క్రీడలకు పాల్పడుతూ... ప్రతిష్టాత్మకమైన పాలనా విభాగం అప్రతిష్ట మూటగట్టుకుంటోంది.

ప్రజాస్వామ్యంలో సమాజాన్ని ప్రభావితం చేసే నాలుగు మూల స్థంభాలలో ఒక ముఖ్య వ్యవస్థ మరో ముఖ్య వ్యవస్థ చేతిలో కీలుబొమ్మగా మారడం ప్రజాస్వామ్య మనుగడకే ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ నాయకుల అడుగులకి మడుగులొత్తుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వ్యవహారశైలి ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. నిరక్షరాస్యుల ఆదేశాలని అమలు చేయడం కోసం 'జీ హుజూర్' అంటూ అక్షరాస్యులు తలాడిస్తున్న తీరు అఖిల భారత అధికార వ్యవస్థకే మచ్చ తెస్తోంది. గౌరవప్రదమైన స్థానాలలో కూర్చుని, రాజ్యాంగ బద్ధంగా ప్రజాహితం కోసం, సమాజ సంక్షేమం కోసం పని చేయవలసిన ఉన్నత స్థాయి అధికారులు, అక్రమార్కుల చేతిలో ఆటబొమ్మలుగా మారుతున్న తీరు మొత్తం వ్యవస్థనే అగౌరవపరుస్తోంది.

డెమోక్రసీ, జ్యుడీషియరీ, బ్యూరోక్రసీ, మీడియా ఈ నాలుగూ సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించే మూలస్థంభాలుగా మన రాజ్యాంగం పేర్కొంది. అలాంటి పరిస్థితులలో, ఒక కీలక శాఖ మరో కీలక విభాగం చేతిలో కీలుబొమ్మై, అమ్ముడుపోతే దేశభవిష్యత్తు ఎంత ప్రమాదకర పరిస్థితులలో పడిపోతోందన్న అనుమానం ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతోంది.

### బలమైన వ్యవస్థ బలహీనమైపోతోంది!

బ్యూరోక్రసీ అంటే అధికార వ్యవస్థ. ఇది అత్యంత శక్తివంతమయ్యింది. వందకి వంద శాతం విద్యావంతులు, విజ్ఞానవంతులు, మేధావులు కొలువైన విభాగం. రాత్రీ పగలూ కష్టపడి చదివి జాతీయస్థాయిలో జరిగే పరీక్షలు రాసి వాటిలో ఉత్తీర్ణులై, ఆ తరువాత జరిగే ఇంటర్వ్యూలలో ఎంపికైతే కానీ అఖిల భారత ప్రభుత్వ సేవలలో చేరే అవకాశం రాదు.

కానీ, రాజకీయాలలో అలా కాదు... వీధి రౌడీగా వున్నా, ఆర్థిక నేరాలతో జైలుకి వెళ్లొచ్చినా, ప్రత్యర్థిని అడ్డంగా నరికాడన్న రక్త చరిత్ర వున్నా నాయకుడి అవతారమెత్తొచ్చు. పొట్ట పొడిస్తే అక్షరం రాకపోయినా... ఒక్క వేలిముద్రతో గ్రామ సర్పంచ్ స్థాయినుండి రాష్ట్ర ముఖ్యమంత్రి హోదా వరకూ పదవులు చేపట్టి రాజ్యమేలొచ్చు. రాజకీయ నాయకులు వచ్చి పోయే మబ్బుల లాంటి వాళ్ళు. అధికారులు అలా కాదు. ఒకసారి బాధ్యతలు చేపట్టాక మళ్ళీ పదవీ విరమణ చేసేవరకూ వివిధ పదవులలో బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహిస్తారు. అలాంటిది, రాజకీయ వ్యవస్థ చేసే అరాచకాలకు మేధావులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు వంత పాడుతున్నారంటే సదరు అధికారుల వ్యక్తిగత స్వార్థం వారిని ఎంతటి స్థాయికి దిగజార్చేస్తోందో మనం ఊహించుకోవచ్చు.

అఖిల భారత ప్రభుత్వ సేవలకి ఎంపికైన ఐఏఎస్‌లు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరిలో వున్న "లాల్ బహుదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్"లో తర్ఫీదు పొందుతారు. తమ శిక్షణ పూర్తి చేసుకుని విధులలో చేరడానికి అకాడమీని వీడే ముందు రాజకీయ నాయకుల తరహాలోనే ప్రమాణం చేస్తారు. "ఫలానా నేను..... అఖిల భారత ప్రభుత్వ సేవకుడిగా నియమింపబడినందున శాసనము ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధి కారాన్ని, సమగ్రతని కాపాడతానని, నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాశక్తులతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను" అంటూ... ఉద్యోగ బాధ్యతలని చేపడతారు. "తన ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి వత్తిడులకి లొంగనని, ఎవరి ప్రలోభాలకు తలొగ్గనని, వ్యక్తిగత స్వార్థానికి తావివ్వనని" కూడా ప్రతినబూని విధులలో చేరతారు.

నిజానికి పై ప్రమాణాలన్నిటికీ విరుద్ధంగా నేటి అధికార వ్యవస్థ పనిచేస్తోంది. మొత్తం అందరూ అలాంటివారే అన్నది నా అభిప్రాయం కాదు. కానీ అధికశాతం అధికారులు అదే కోవకి చెందినవారై... ఆ దోవలో నడుస్తున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను.

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రభుత్వాధినేతల ఆదేశాలు పాటించాల్సిన బాధ్యత అధికారులపైన ఉంటుంది. అయితే, అధినేతల ఆదేశాలు చట్టాలకి లోబడివుండాలే తప్ప వాటికి అతిక్రమించి కాదు. కానీ, అధిక శాతం అధికారులు అలా చేయడంలేదు. చట్టాలని పట్టించుకోవడంలేదు. మితిమీరిన స్వామి భక్తిని చూపించి కళ్ళు మూసుకుని సంతకాలు పెడుతున్నారు.

అధికారంలో ఉన్న నేతల వత్తిళ్లకి, వారు చూపించే తాయిలాలకి లొంగి, వాళ్ళు కురిపించే పొగడ్తలకి పొంగి తమ జీవితాలను పణంగా పెడుతున్నారు. కొన్ని సందర్భాలలో అఖిల భారత ప్రభుత్వ అధికారులు అంటే... ఐఏఎస్, ఐపీఎస్‌లు జైళ్లపాలు కావడం కూడా మనం చూస్తూనే వున్నాం.

మన భారత రాజ్యాంగం కొన్ని నియమనిబంధలని రూపొందించింది. వాటిని చట్టబద్ధం చేసింది. రాజకీయ నాయకులైనా, ప్రభుత్వ అధికారులైనా వాటికి లోబడే పనిచేయాలి. కానీ, అలా జరగడం లేదు. రాజకీయ నాయకులు నిస్సిగ్గుగా వాటిని అతిక్రమిస్తున్నారు. అధికారులు నిస్సంకోచంగా వారికి మద్దతు తెలుపుతున్నారు. తమ పైఅధికారులు ఇచ్చిన ఆదేశాలు చట్ట విరుద్ధమైనవైనా క్రిందిస్థాయి అధికారులు వాటిని అయిష్టంగానే అమలు చేస్తున్నారు. అలా చేయకపోతే తమ బాసులకి ఎక్కడ కోపం వస్తుందోనన్నది వారి భయం. ఈ సంప్రదాయం మంచిదికాదు. ఇలాంటి చర్యల ద్వారా రాజకీయాల పట్ల, అత్యున్నత హోదాల పట్ల యువతకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదముంది.

ఈ పరిస్థితులు మారాలి. అధికార వ్యవస్థ ఆలోచించుకోవాలి. తాము చదివిన చదువు, నేర్చుకున్న సంస్కారం, అలవర్చుకున్న క్రమశిక్షణ, తమ సుదీర్ఘ భవిష్యత్తు ఈ స్వార్థపూరిత రాజకీయ నాయకులకి తాకట్టు పెట్టడం ఎంతవరకూ సమంజసమో ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాజకీయ చట్రంలో "జీరోక్రసి"గా మారిన "బ్యూరోక్రసీ"ని "హీరోక్రసీ"గా మార్చాలి.

తాము 'అతి'కారులం కాదు 'అధికారులం' అని బలంగా చెప్పాలి. సమసమాజ స్థాపనకు నిఖార్సైన అధికార వ్యవస్థనుండే పునాది పడాలి! - రాజశ్రీ

# అసెంబ్లీ ఆరంభమే అదిరింది!


ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడి నాయకత్వంలో జూన్ 21వ తేదీన కొలువైన కొత్త ప్రభుత్వం ఆరంభమే అదిరింది. నిరాడంబరంగా జరిగిన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం చాలా హుందాగా అనిపించింది. అరుపులు, కేకలు, రచ్చలు, రభసలూ లేకుండా జరిగిన తీరు సభ విలువని పెంచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి విడిపోయిన తరువాత కుటుంబమంతా కూర్చుని వీక్షించదగిన రీతిలో సభ నడిచింది. భవిష్యత్తులో కూడా ఇదే తీరు కొనసాగితే బాగుంటుంది. అసలు సభలో ప్రతిపక్షమే లేకుండా వుండాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ కోరుకున్నాడు. ఆయన కొలిచే జీసస్ క్రైస్ట్ తథాస్తు అన్నట్లుంది. కాకపోతే జగన్‌ని 11సీట్లకి పరిమితం చేసి ప్రతిపక్షహోదా కూడా లేకుండా, సభలో తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రతిపక్షమే లేకుండా చేశారు. జగన్ చూపిన మార్గంలోనే రివర్స్ విధానాన్ని ఆ ప్రభువు కూడా పాటించినట్లున్నారు. వాదించే వీరులు, తొడలు, జబ్బలు చరిచే శూరులు, మీసాలు మెలిపెట్టే ధీరులు సభలో ఉండరు కాబట్టి, భవిష్యత్తులో ఈ అయిదేళ్ళ పాటు జరగబోయే అన్ని శాసనసభా సమావేశాలు కూడా ఇదే తరహాలో ఉంటాయని ఆశిద్దాం..!

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

# వీ.ఆర్.కాలేజీకి లభించిన వరం వీఎస్ఆర్ సారు!

వీఆర్ కళాశాల విశ్రాంత ఆంగ్ల బోధకులు వీఎస్ రామచంద్రరావు గారు దివంగతులయ్యారని 'లాయర్' ద్వారా తెలిసి చాలా బాధేసింది. వీఆర్ కళాశాలకు లభించిన వరం రామచంద్రరావు గారు. వారితోపాటు ఏ.టి.శ్రీనివాసరావు గారు, వేదం వెంకటరామన్ గారు వీరి కంటే కొంచెం ముందు దుర్భా రామమూర్తి గారు లాంటి వారంతా కళాశాల ప్రతిష్టని పెంచిన మహోన్నతులు. కావలి జవహర్ భారతిలో సేవలందించిన పెద్దాడ రామస్వామి గారు కూడా వీరికి సమకాలికులే. వీఎస్. రామచంద్రరావు గారి పట్ల వరప్రసాద్‌రెడ్డి గారు చూపించిన గురు వాత్సల్యం అభినందదాయకం.

ప్రొ. సిఆర్.విశ్వేశ్వరరావు, హైదరాబాదు.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

# బిట్రగుంటను బ్రతికించండి

భారతీయ రైల్వే చరిత్రలో ఆనాడే ఆంగ్లేయుల చేత 'టెంపుల్ ఆఫ్ స్టీల్ హార్సెస్'గా పిలిపించుకొన్న(రైల్వే) బిట్రగుంట.. ప్రస్తుతం అనాథగా కోమాలో ఉంది. అనుకూల పరిస్థితులు, ఆస్తిపాస్తులు కలిగిన బిట్రగుంట రైల్వేపరంగా ఆదరణ లేక నిర్వీర్యంగా మారిపోయింది. ఈ ప్రదేశంలో రైల్వేకి సంబంధించిన వర్క్‌షాపు లాంటిది ఏదైనా ప్రాజెక్టుకు ప్రాణం పోసి ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచవలసిందిగా మన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారికి, పెద్దలు, అధికారులు మరియు శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక ప్రార్థన. – నలుబోలు రామ్మోహన్‌రెడ్డి, హైదరాబాదు.



# 'అమృతోత్సవం'లోకి అందరివాడు
# మన వెంకయ్య 'పంచ సప్తతి'



**నెల్లూరు నేల... ఆయన పేరుని గర్వంగా పలుకుతుంది.**
**నెల్లూరు గాలి... ఆయన పేరు విని పులకరిస్తుంది.**
**నెల్లూరు నిప్పు... స్వరాజ్య ఉద్యమంతో పాటు ఆయన ఉద్యమ స్ఫూర్తిని గర్వంగా వినిపిస్తుంది.**
**నెల్లూరు నీరు... ప్రతి అడుగులోనూ ఎగసిపడిన ఆయన జీవితాన్ని కథలుగా చెబుతుంది.**
**నెల్లూరు నింగి... తన అంత ఎత్తుకి ఎదిగిన ఆయన జీవితాన్ని గర్వంగా చూసుకుంటుంది.**

*యస్మై త్వమిహ మృత్యవే దిష్టః పురుష జజ్ఞిషే*
*స చ త్వాను హ్వాయామసి మా పురా జరసో మృథాః*

*ఈ అథర్వణ వేదవాక్యం వృద్ధాప్యం రాకుండా మరణించవద్దని చెబుతుంది. ఇక్కడ వృద్ధాప్యం అంటే ముసలితనం కాదు. మంచి చెడులు తెలిసిన పెద్దరికం. నలుగురికీ దిశానిర్దేశం చేయగలిగిన పరిణతి కలిగి ఉండటం. అలాంటి వారు భవిష్యత్తును ముందుకు నడపగలరని వేదం ఆకాంక్షించింది. అంటే వయసుతో పాటు వచ్చే పెద్దరికాన్ని హుందాగా ఎలా నిలబెట్టుకోవాలి, అంకెలు మాత్రమే ఐన వయసుకు మనసుతో లంకె ఎలా వేయాలో తెలిసిన వారే నిజమైన పెద్దలని ఈ వాక్యం మనకు వివరిస్తోంది. ఈ సూత్రానికి అచ్చంగా సరిపోయే తెలుగు తేజం, నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు. జూలై1, 2024తో 75వ ఏట అంటే.. అమృతోత్సవ పడిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మన వెంకయ్యకి 'లాయర్' అక్షర నీరాజనాలు సమర్పిస్తోంది.*

నెల్లూరుకు దగ్గరలోని ఓ కుగ్రామం చవట(చౌడు)పాలెం. ఈ ఊరిలో 1949 జులై1న రంగయ్యనాయుడు, రమణమ్మ దంపతుల నోముల పంటగా వెంకయ్యనాయుడు ప్రభవించారు. మట్టిని నమ్ముకున్న రైతు ఇంట ఓ మాణిక్యం ఉదయించి సమాజానికి వెలుగులు పంచుతుందని ఆనాడు బహుశా ఎవరూ ఊహించి ఉండరేమో. నెలల బిడ్డగా ఉన్నప్పుడు తల్లి దూరమైంది. ఈ బాధలో తండ్రి ఆలన కూడా వెంకయ్యకు కరువైంది. తల్లిలేని బిడ్డను అమ్మమ్మ చేరదీసింది. తాతయ్య నేర్పించిన విద్య జ్ఞానాన్ని పెంచింది. నా బిడ్డ లాయర్ కావాలన్న తల్లి కలలను నిజం చేయటానికి విధి వారిద్దరిని వెంకయ్యకు అమ్మా, నాన్నలని చేసింది. పై సూత్రంలాగా పెద్దరికంలోని నిజమైన అర్థాన్ని చూపెట్టింది.

చిన్నతనం నుంచి చదువుల్లో ఎప్పుడూ ముందుండే వెంకయ్య, నలుగురికి సమస్య వస్తే తట్టుకునే వారు కాదు. ఎంతటి పోరాటానికైనా సిద్ధమయ్యే వారు. సరిగ్గా అదే సమయంలో కబడ్డీ ఆట మీద ఆసక్తి వల్ల ఆర్.ఎస్.ఎస్. పరిచయం అయ్యింది. భారతదేశానికి, వెంకయ్య దేహానికి లంకె పడింది ఆ సందర్భంలోనే. జాతి హితమే అజెండాగా అప్పటినుంచి ఆయన ముందుకుసాగారు. ప్రజా సమస్యలకు స్పందించటం, పరిష్కారం కోసం ఉద్యమించటం, ప్రజల హక్కుల దిక్కుగా నిలవటం వంటి నాయకత్వ లక్షణాలతో ఎదిగారు. న్యాయవాద విద్య చదవటం కోసం విశాఖపట్నం చేరుకున్నారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం ఆయనలోని నాయకుడిని ప్రపంచానికి పరిచయం చేసింది. ఏప్రిల్ 14, 1971న మస్తాన్ నాయుడు, కౌసల్యమ్మల కుమార్తె ఉషను జీవిత భాగస్వామిగా స్వీకరించారు. వారి కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపమ్మ ఇద్దరూ తండ్రికి తగ్గ బిడ్డలే. ఎమర్జెన్సీ సమయంలో జైలుపాలైనప్పుడు కూడా బాధను మునిపంటిన ఉంచి ధైర్యంగా నిలబడిన ఉషమ్మలోని నిబ్బరం, ప్రతి సమస్యలో తమ కుటుంబానికి అండగా నిలిచిన అత్తగారైన కౌసల్యమ్మ మంచితనం, చిన్నతనం నుంచి ప్రతి అడుగులో అండగా నిలబడిన ఆత్మీయ మిత్రబృందం తన ఉన్నతికి కారణం అని చెప్పే సంస్కారం మన వెంకయ్య సొంతం.

## ఉవ్వెత్తున ఎగసిన రాజకీయ ఉత్తేజం!

అప్పట్లో .... అంటే , 1972లో జరిగిన జై ఆంధ్రా ఉద్యమంలో క్రియాశీలక భాగస్వామ్యంతో ముందుకు సాగారు. వెంకయ్యలోని వాక్చాతుర్యం, సమ్మోహింపజేయగల మాటల మంత్రజాలాన్ని సీనియర్ నాయకులు గుర్తించారు. మరింతగా ప్రోత్సహించారు. సరిగ్గా అప్పుడే 1975లో భారతదేశాన్ని ఎమర్జెన్సీ గ్రహణం కమ్మేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా జయప్రకాష్ నారాయణ్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాల్సిందిగా వెంకయ్య ఆహ్వానించారు. ఫలితంగా అయన జైలుశిక్షకు గురయ్యారు. 17 నెలల కాలం... ఆ చీకటిని కూడా తనకు అనుకూలంగా మార్చుకున్నారు వెంకయ్య. తనతో పాటు జైలులో ఉన్న ఇతర సహచరులతో కలిసి ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి అని చర్చించారు. బయటకు వచ్చిన తర్వాత కూడా ఉద్యమాన్ని ఆపకుండా ఇతరుల్లో స్ఫూర్తి రగిలించేందుకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## జైలు నుండి జాతీయ స్థాయికి!

సాధారణంగా జైలు శిక్షల వంటివి మనిషిని భయపెడతాయి. కానీ వెంకయ్యను భయపెట్టలేదు సరికదా... ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే దృఢ సంకల్పానికి బీజాలు వేశాయి. ఆయన జాతీయ నాయకుడిగా ఎదగడానికి దోహదం చేశాయి. అదే సమయంలో 1978లో జనతా పార్టీ తరపున ఉదయగిరి నుంచి శాసనసభ్యునిగా పోటీ చేశారు. ప్రత్యర్థి తరపున స్వయంగా ఇందిరాగాంధీ వచ్చి ప్రచారం చేసి వెళ్ళినా ఉదయగిరి ప్రజలు మాత్రం వెంకయ్యనాయుడుకే పట్టం కట్టారు. ఆ తర్వాత 1983లో ఎన్టీఆర్ ప్రభంజనం వీస్తున్నా రెండోసారి విజయపతాకాన్ని ఎగురవేశారు. 1984లో ఎన్టీఆర్‌కు సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచిన సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ధర్మం పక్షాన నిలబడ్డారు. జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించి ఎన్టీఆర్ గెలుపునకు కారణం అయ్యారు. ఆ సమయంలో ఎన్టీఆర్ మంత్రి పదవి ఇస్తానన్నా సున్నితంగా తిరస్కరించారు. ఈ నిబద్ధతే వారి గౌరవాన్ని మరింత పెంచింది. ఆ తర్వాత కాలంలో ఆయనని జాతీయ రాజకీయాల వైపు నడిపించేలా చేసింది. పార్టీ కోసం దేశమంతా తిరిగి పని చేశారు. వరుసగా 1998, 2004, 2010, 2016 సంవత్సరాల్లో రాజ్యసభ సభ్యుడిగా సేవలు అందించారు.

## గ్రామ స్థాయినుండి... కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి వరకూ!

వెంకయ్య గారి రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు దేశ రాజకీయాల్లో ప్రారంభమైంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వారికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని వాజ్‌పేయి భావించారు. మంచి పదవి తీసుకోవాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి కావాలన్న వెంకయ్య కోరిక వారిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ప్రాధాన్యమున్న మంత్రిపదవులు కాదని దీన్నే ఎందుకు కోరుకున్నారో నాటి బీజేపీ పెద్దలకు అర్థం కాలేదు. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధి మంత్రిగా ప్రధానమంత్రి గ్రామీణ సడఖ్ యోజనకు రూపకల్పన చేశారు. చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి గ్రామాల ఆర్థిక స్థితిగతులు మార్చే ప్రయత్నం చేశారు. ఆ సంకల్పమే ఈరోజు అనేక గ్రామాల ఆర్థికవృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. యువతకు అవకాశాలను చేరువ చేస్తున్నాయి. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడి బాధ్యతల విషయంలో కలవరం మొదలైంది. పదవి వదలి పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఎవరు చేపడతారన్న అనుమానాలు. సరిగ్గా ఆ సమయంలో పదవిని వదులుకోవటానికి వెంకయ్య సిద్ధపడ్డారు. మంత్రి పదవి వదలి మరీ పార్టీ పగ్గాలు చేపట్టారు. ఒకప్పుడు వాజ్‌పేయి మీటింగ్ గురించి నెల్లూరులో పరిచయం చేసిన వెంకయ్యనాయుడు, వాజ్‌పేయి, అద్వానీల మధ్య కూర్చుని పార్టీని నడిపిస్తారని ఆయన కలలో కూడా ఊహించి ఉండరేమో! నిబద్ధత దీన్ని నిజం చేసింది.

## అలుపెరుగని గళం - విరామమెరుగని పయనం!

వెంకయ్య పేరు చెప్పగానే మనకు గుర్తొచ్చేది సమ్మోహితుల్ని చేసే మాటల మాయాజాలం. నాయకత్వ లక్షణాల్లో మరింత కీలకమైనది కూడా అదే. వారు నోరు విప్పితే చాలు, పదాలు పరుగులు పెడుతూ వరుసలో నిలుచుంటాయి. యతిప్రాసలు కదం తొక్కి ప్రవహిస్తాయి. వెయ్యి తుపాకులు ఒక్కసారిగా విజృంభించినట్లుగా వారి మాటలు తూటాలై ప్రతిధ్వనిస్తాయి. వారి వాగ్ధాటి యువతను ఉత్తేజితుల్ని చేస్తుంది. వినే జనాల్లో ఆవేశాన్ని నింపటమే కాదు, ఆలోచన మొలకలెత్తించి కర్తవ్యోన్ముఖుల్ని చేయటం కూడా ఆయన ప్రసంగాల్లోని ప్రత్యేకత. 8 భాషల్లో అనర్గళంగా సాగే వెంకయ్య వాగ్ధాటికి తెలుగువారే కాదు, ఉత్తరాది వారు సైతం మంత్ర ముగ్ధులౌతారు. ఆ వాగ్ధాటి తోనే దేశమంతా తిరిగి భారతీయ జనతా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని నింపారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేశారు. వాజ్‌పేయి గారి తర్వాత మోదీకే ప్రజా మద్దతు అధికంగా ఉందని గ్రహించింది కూడా వెంకయ్యనాయుడే. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న వారిని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని చొరవ తీసుకుని ఒప్పించి, మెప్పించి పార్టీని మరోసారి విజయతీరాలకు చేర్చారు. మోదీ మంత్రివర్గంలో పట్టణాభివృద్ధి, పార్లమెంట్ వ్యవహారాలు, సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించి తమదైన ముద్రవేశారు. అమృత్, స్మార్ట్ సిటీ వంటి పథకాలతో పట్టణాలకు సైతం నూతన అభివృద్ధిని పరిచయం చేశారు.

## ఉదయగిరి నుండి ఉపరాష్ట్రపతి స్థాయికి!

సరిగ్గా అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఎక్కువగా ఉన్న రాజ్యసభను సమర్థవంతంగా నిర్వహించగలిగే నాయకుడి కోసం వెతుకులాట మొదలైంది. ఉపరాష్ట్రపతి పదవికి అన్ని విధాల సమర్థుడు ఒక్క వెంకయ్యే అని గ్రహించి వారిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించారు. కన్నతల్లి లాంటి పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేసిన సందర్భంలో వెంకయ్య భావోద్వేగానికి లోనయ్యారు. మరోసారి తన తల్లికి దూరమవుతున్నానన్నంతగా ఉద్వేగభరితులయ్యారు. అయితే జాతిలో జవసత్వాలు నింపగలిగే ఓ బాధ్యత స్థానంలోకి వెళ్ళటాన్ని ఆయన స్వాగతించారు. భారతదేశ ఉపరాష్ట్రపతిగా తనదైన ముద్రవేశారు. రాజ్యసభలో బ్రిటీష్ కాలం నాటి వ్యవహారశైలికి స్వస్తిపలికి సభ్యుల ఆత్మగౌరవాన్ని పెంచారు. మాతృభాషల్లో మాట్లాడే విధంగా సభ్యులకు సౌకర్యాన్ని కల్పించి, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. సభ సజావుగా సాగాలని ఆయన డిస్కస్.. డిబేట్.. డిసైడ్..డునాట్ డిస్టర్బ్ అనే నినాదంతో ముందుకు సాగారు. ఉపరాష్ట్రపతి మాటలకు సభ్యులు గౌరవమిచ్చేవారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సభలో డిగ్నిటీ... డెకొరమ్... డీసెన్సీ... ఉండేలా జాగ్రత్తపడేవారు వెంకయ్య. ఆయన ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడే రాజ్యసభలో అనేక చారిత్రక బిల్లులు చర్చకు వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దు, కాశ్మీర్‌కు స్వంతంత్ర ప్రతిపత్తి రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, జి.ఎస్.టి. వంటి కీలక బిల్లులు ఆమోదం పొందేలా సభను సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన హయాంలో రాజ్యసభ ఎక్కువ గంటలు కొనసాగింది.

వెంకయ్యకి భారతీయ సంస్కృతి అంటే ప్రాణం. మాతృభాషలో మాట్లాడాలన్నా, పంచెకట్టుతో కనిపించాలన్నా చాలా ఇష్టం. దేశ విదేశాల్లో పర్యటించినా పంచెకట్టుతోనే కనిపించేవారు. ఉపరాష్ట్రపతి అయ్యాక డ్రస్ మారుతుందా అని కొందరు అడిగితే... నో ఛేంజ్ ఇన్ మై డ్రస్... ఛేంజ్ ఈజ్ ఓన్లీ ఇన్ మై అడ్రస్ అంటూ... చమత్కరిస్తూ తన అభిమాతాన్ని సగర్వంగా చాటిచెప్పారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. ఉపరాష్ట్రపతి హోదాలో ఆయన ప్రస్థానం విజయవంతంగా కొనసాగింది. అయిదేళ్ళ వ్యవధిలో తమ సామర్థ్యం, పనితీరుతో ఓ ప్రత్యేక ముద్రను రాజ్యసభలో వెంకయ్య ప్రదర్శించగలిగారు.

విద్యార్థి నాయకుడిగా, ఓ సామాన్య కార్యకర్తగా మొదలైనవారి జీవన ప్రస్థానంలో శాసనసభ్యుడితో మొదలుపెట్టి ఉపరాష్ట్రపతి వరకూ ఎన్నో మైలురాళ్ళు. ఐక్యరాజ్యసమితి 'ఆవాస' విభాగానికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావటం, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నడిచే శాంతి విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందటం వంటివి వారి ప్రపంచ స్థాయి నాయకత్వానికి నిదర్శనం. కర్తవ్యాన్నే నమ్ముకుని ప్రజల నమ్మకంతో... ప్రజల భరోసాతో.. ప్రజల ప్రేమతో అంచెలంచెలుగా ఎదిగారు. ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి దాకా... పల్లె నుంచి పద్మవిభూషణ్ దాకా.. సాగిన ఆ ప్రయాణం అసామాన్యం.. అనితరసాధ్యం.

అమృతోత్సవ పడిలోకి అడుగుపెట్టిన అందరివారు, మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడికి నెల్లూరీయుల పక్షాన "శతమానంభవతి"...!



## పవన్‌కల్యాణ్‌తో వేమిరెడ్డి దంపతుల భేటీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఇటీవల తాడేపల్లిలోని కార్యాలయంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు గౌరవపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ వేమిరెడ్డి దంపతులు ఎంపీగా, ఎమ్మెల్యేగా విజయం సాధించడాన్ని ప్రస్తావిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. వారి వెంట తనయుడు అర్జున్‌రెడ్డి ఉన్నారు.

## రొట్టెల పండుగకు భారీ ఏర్పాట్లు

### బారాషహీద్ దర్గాలో ముమ్మరంగా పనులు

మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతోన్న.. నెల్లూరులోని పవిత్రమైన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వచ్చే నెల మూడవ వారంలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన 'రొట్టెల పండుగ', దర్గాలో అత్యంత వైభవంగా గంధమహోత్సవం జరుగనున్న సందర్భంగా నెల్లూరు నగరపాలక సంస్థ భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. దేశవిదేశాల నుంచి ఈ పండుగకు లక్షలాది మంది యాత్రికులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారయంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. అందులోనూ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం, నెల్లూరు శాసనసభ్యులుగా విజయం సాధించిన పొంగూరు నారాయణ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రిగా పదవిని చేపట్టడంతో రాష్ట్ర పండుగగా ఖ్యాతి పొందిన రొట్టెల పండుగను మరింత దేదీప్యమానంగా నిర్వహించాలని నిర్ణయిం చారు. దీంతో, బారాషహీద్ దర్గా కొత్త వెలుగులు సంతరించుకుంటోంది.

## బాధితులకు అండగా రెడ్‌క్రాస్



బర్మాషెల్‌గుంటలోని అగ్నిప్రమాద బాధితులకు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అండగా నిలిచింది. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామంటూ ముందుకు వచ్చింది. రెడ్‌క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితుల కుటుంబాలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, టార్పాలిన్‌పట్టలు, వంటసామగ్రి, హైజిన్ కిట్లు, దుప్పట్లు, బియ్యం వగైరాలన్నీ అందజేశారు రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### అగ్ని బాధితులకు

## నారాయణ రూ.లక్ష సాయం



ఇటీవల భారీ అగ్నిప్రమాదం జరిగిన బర్మాషెల్‌గుంటకు వచ్చి ప్రమాదానికి గురైన బాధితులను మంత్రి నారాయణ ఓదార్చారు. ప్రమాదం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా సీఎం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల వంతున సాయం అందించాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు బాధితులకు ఆయన చెక్కులు అందజేశారు. నెలరోజుల్లోగా బాధితులకు ఇళ్ళు ఏర్పాటుచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ఘటన విషయాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెప్పడంతోనే ఆయన వెంటనే తనవంతు సాయంగా బాధితులకు రూ.15వేల వంతున సాయం అందించారని తెలిపారు.

### 'విపిఆర్ విద్య' ఏర్పాటు..

## మాకెంతో సంతోషకరం

**వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**




నెల్లూరులో 'విపిఆర్ విద్య' పాఠశాల ద్వారా వందలాది మంది నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్యను అందించడం విపిఆర్‌కు, తనకు చాలా సంతోషాన్నిస్తుందని విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. 2024-2025 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని, విపిఆర్ విద్య పాఠశాలలో ఉచిత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇటీవల ఆమె విద్యాసామాగ్రి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు 30 మంది పరీక్షలు రాస్తే 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో 27 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించి, దేశానికి మంచి సేవలు అందించాలంటే క్రమశిక్షణ చాలా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో యోగా దినోత్సవం



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని సరస్వతినగర్‌లో ఉన్న డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల్లో యోగా దినోత్సవాలు సంబరంగా జరిగాయి. విద్యార్థులు చక్రాసనం, సర్వాంగాసనం, పశ్చిమోత్తాసనం, వజ్రాసనం, ధనురాసనం తదితర యోగాసనాలను అద్భుతంగా ప్రదర్శించి అందరి అభినందనలు అందుకున్నారు. యోగాసనాలు ఆచరించడం వల్ల ఏకాగ్రత, శారీరక ధారుఢ్యం, మానసిక స్థైర్యం అలవడుతాయని, విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతినిత్యం కొంతసేపు యోగసనాలను అభ్యసించాలని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా చెప్పారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, ప్రపూర్ణ పాల్గొన్నారు.

### టౌన్‌హాలు ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో..

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరులోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం వారి ద్వారా, టౌన్‌హాలు ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో ఈనెల 23న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. నెల్లూరు నగరం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమస్థానం సాధించిన 36మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున నగదు బహుమతి, షీల్డ్, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విశ్రాంత డెప్యూటి కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి పాల్గొని ప్రతిభా పురస్కారాలను అందజేసి విద్యార్థులను అభినందించారు. ట్రస్టుబోర్డు సభ్యులు వాకాటి విజయ కుమార్‌రెడ్డి, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెభక్తవత్సలరెడ్డి, సి.వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం, స్థానిక గురుకృప కళాక్షేత్రానికి చెందిన నాట్య కళాకారుల శాస్త్రీయ నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- వీఆర్‌సి విశ్రాంత ఫిజిక్స్ అధ్యాపకుల సమావేశం

## 'ది రేషనల్ సోలార్ క్యాలెండర్' ఆవిష్కరణ



నెల్లూరులోని వీఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగంలో సుదీర్ఘకాలం పనిచేసి, ఉద్యోగ విరమణ తరువాత విశ్రాంత జీవితం గడుపుతున్న అధ్యాపకుల ఆత్మీయ సమావేశం ఈనెల 24న స్థానిక మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఘనంగా జరిగింది. అమెరికా నుండి ప్రత్యేకంగా ఈ సమావేశానికి వచ్చిన సీనియర్ విశ్రాంత అధ్యాపకులు ఎం. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ, ఎంతో ఘనచరిత్ర గల వీర్ కళాశాల ఇప్పుడు వెలవెలబోతుండడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. తొలుత, పూర్వ అధ్యాపకురాలు.. శతాధిక వృద్ధురాలు వి.సరోజను ఆమె నివాసంలో అధ్యాపకులు కలసి సత్కరించారు.

ఈ సందర్భంగా విశ్రాంత ఫిజిక్స్ హెడ్ డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి రాసిన 'ది రేషనల్ సోలార్ క్యాలెండర్' అనే పుస్తకాన్ని అధ్యాపకులు ఆవిష్కరించారు. తిథులు, వారాలు, రోజులు తదితర అంశాలపై ఎంతో పరిశోధన చేసి ఈ పుస్తకాన్ని ప్రచురించానని రచయిత తెలిపారు. వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు వి.నరసారెడ్డి, డాక్టర్ ఎ.సుందర్‌జాకబ్, కె.రవీంద్ర, బి.హరిప్రసాద్, బి.వేమారెడ్డి, ఎ.కృష్ణమోహన్, డాక్టర్ ఎ.వి.రంగారెడ్డి, ఎస్.కె.సాబ్జాన్‌లతో పాటు సర్వీసులో ఉన్న అధ్యాపకులు వి.వి.కృష్ణ శర్మ, ఎ.రవిప్రసాద్, టి.హరనాథ్ మరియు బోధనేతర సిబ్బంది వై.కోటేశ్వరరావు, ఎన్.చెంచయ్య, ఆర్.శ్రీనివాస కుమార్, జి.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.




## ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన



నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణమండపంలో ఇటీవల ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. అనేక రకాల చేనేత చీరలు, కళానైపుణ్యానికి అద్దంపట్టే వస్త్రాలు, దాదాపు 70 రకాల చేనేత ఉత్పత్తులతో నగర ప్రజలను ఆకర్షిస్తోంది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన ప్రజలకు అందుబాటులో ఉంటుందని, మరో 15 రోజులపాటు దీనిని కొనసాగిస్తామని నిర్వాహకులు సంజయ్‌జైన్ తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఇటీవల సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్ కాన్సుల్ జనరల్



చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్‌గా ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన తకాహాషి మునియో ఈనెల 25న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా, శ్రీసిటీలో పెట్టుబడుల అవకాశాలు, వ్యాపార ప్రయోజనాల గురించి రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు వివరించారు. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ శ్రీసిటీ అని ఆయన అంటూ, ఆటోమొబైల్, ఇంజినీరింగ్, లాజిస్టిక్ వంటి వివిధ రంగాలలో ఖ్యాతి గడించిన 30పైగా జపనీస్ పరిశ్రమలు ఇక్కడ కొలువుతీరాయని అన్నారు. ఈ పరిశ్రమలన్నింటిలో కలిపి రూ.16,000కోట్ల పెట్టుబడులు, సుమారు 20 వేల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయని చెప్పారు. జపాన్ దేశ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఒక ఎన్క్లేవ్ అభివృద్ధి చేశామన్నారు. కాన్సుల్ జనరల్ సందర్శన శ్రీసిటీకి చాలా ముఖ్యమైనదని, దీంతో మరిన్ని జపాన్ కంపెనీలు శ్రీసిటీకి తరలివస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. శ్రీసిటీలోని మౌలిక వసతులపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్ జనరల్, వ్యాపార నిర్వహణకు అత్యంత అనువైన పారిశ్రామికవాడలలో శ్రీసిటీ ఒకటని కొనియాడారు. ప్రత్యేకించి ఇక్కడ జపాన్ పరిశ్రమలకు అనువైన సదుపాయాలు ఉన్నాయని, మరిన్ని జపనీస్ పరిశ్రమలు శ్రీసిటీకి రావడానికి తప్పక ఆసక్తి చూపుతాయని అన్నారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు ప్రముఖ జపనీస్ పరిశ్రమలు ఇసుజు, డైకిన్ ఇండియాను కాన్సుల్ జనరల్ సందర్శించారు. ఇసుజు పరిశ్రమ ఆవరణలో శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశమై చర్చించారు.

# అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయండి

## - విద్యా మంత్రి లోకేష్‌కు ఏబిఆర్ఎస్ఎం నాయకుల వినతి



రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న దాదాపు 5000 అధ్యాపకుల ఖాళీలను, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 2000 ఖాళీలను, ఇంటర్మీడియట్ కళాశాలలో ఉన్న 3500 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంగ్(ఏబిఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. అదేవిధంగా, 2015 నుండి కేవలం నెలకు 10వేల రూపాయలు జీతంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి ఉపన్యాసకులకు కనీస జీతం రూ.30000గా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్సుడ్ స్కీం కింద ప్రమోషన్లు చేపట్టాలని, డిగ్రీ-జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరుతూ ఆమేరకు మంత్రికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఆ సంఘం ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన విపిఆర్

## • జిల్లా ప్రజల్లో వెల్లువెత్తిన ఆనందం

సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించి, నెల్లూరు ఎంపీగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈనెల 24న తొలిసారిగా ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన దృశ్యాలు నెల్లూరు జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. 'వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ..అను నేను'.. లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను' అంటూ లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు. 18వ లోక్‌సభ ప్రారంభమైన నేపథ్యంలో తొలిగా ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతబ్‌ను ఎన్నుకోగా.. ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఢిల్లీలో నెల్లూరు పేరు మారుమోగిపోయింది. జిల్లావాసుల కల సాకారమైనట్లయింది. అట్టహాసంగా జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో విపిఆర్ సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో పాటు, తనయులు అర్జున్ రెడ్డి, కుటుంబసభ్యులు, హనీష్, నెల్లూరు డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ పార్లమెంటరీ పార్టీ కోశాధికారిగా.. విపిఆర్

తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కోశాధికారిగా నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఇటీవల మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంటరీ పార్టీ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని చంద్రబాబునాయుడు నియమించారు. ఈ సందర్భంగా ఎంపీగా జిల్లాకు నిధులు తీసుకురావడంతో పాటు, పార్లమెంట్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ ట్రెజరర్‌గా సమర్థవంతమైన బాధ్యతలను వేమిరెడ్డి నిర్వహించనున్నారు. తనపై నమ్మకంతో ఆ పదవిలో తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విపిఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



## వేమిరెడ్డి నివాసంలో.. జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చ

ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లాల ఎమ్మెల్యేలు, ఇద్దరు రాష్ట్ర మంత్రులు ఇటీవల తాడేపల్లిలోని విపిఆర్ నివాసంలో భేటీ అయ్యారు. ఎంపీ వేమిరెడ్డితో పాటు, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని జిల్లా అభివృద్ధి అంశాలపై చర్చించారు.

# పిల్లోడు కాదు..పిడుగు

## స్కేటింగ్‌లో అదరగొట్టాడు





స్కేటింగ్‌లో అదరగొట్టేశాడు. పిల్లోడు కాదు..పిడుగే అనిపించాడు. పతకాలు చేతపట్టి నెల్లూరు పేరు మారుమోగించాడు. ఆ బుడతడు మరెవరో కాదు.. నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ఎస్.సాయి మన్విత్. ఇటీవల తిరుపతిలో జరిగిన జోనల్‌స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్కేటింగ్ రింక్-2లో బంగారు పతకాన్ని సాధించాడు. అంతేకాదు, రింక్-3లో రజత పతకాన్ని, రింక్-1లో కాంశ్య పతకాన్ని కైవసం చేసుకుని తన సత్తా చాటుకున్నాడు. ఆ విద్యార్థిని విద్యాసంస్థల అధినేతలు డా.కిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. ఈనెల 25న స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ, తమ విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం సంతోషకరమని, సాయిమన్విత్ మరెన్నో విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.




## రోజుకు 24 కాదు..

# '25 గంటలు' కూడా రానున్నాయి!

### ➢ శాస్త్రవేత్తల అంచనా



నమ్మడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజం. ప్రస్తుతం 24 గంటలుగా ఉన్న రోజు.. భవిష్యత్‌లో 25 గంటలకు మారుతుందని, వాతావరణంలో వేగంగా సంభవిస్తున్న మార్పుల కారణంగా భూమి వేగంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి వేగం మందగించడం వల్ల సూర్యుడి చుట్టూ భూమి తిరిగే సమయానికి మరో గంట అదనంగా పట్టే అవకాశం ఉందని, అప్పుడు ఒక రోజుకు 25 గంటలు అయ్యే అవకాశం ఉందని మ్యూనిక్‌లోని టెక్నికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల అంచనా. అయితే, ఇది ఇప్పటికిప్పుడు జరిగే అవకాశం లేదు. 14 లక్షల సంవత్సరాల క్రితం రోజుకు 18.41 గంటలు ఉండేది. ఈ లెక్కన చూస్తే మరో 20 కోట్ల సంవత్సరాల్లో ఈ భూమిపై రోజుకు 25 గంటలు కానుండడమే చిత్రమని శాస్త్రవేత్తలు ఎంతో ముందుచూపుతో ఈ వివరాలను వెల్లడిస్తున్నారు. అయినా, కాలప్రవాహంలో ఎన్నో చిత్రవిచిత్రాలుంటాయి. అలాంటివాటిలో ఇదొకటి అనుకోవచ్చు. భూమిపై ఒక రోజు కాలం 25గంటలకు పెరిగితే.. అప్పుడు చందమామ కూడా భూమికి దగ్గరగా వస్తాడని చెబుతున్నారు. అప్పటికి.. భూమిపై ఉండే ఖండాలన్నీ ఏకమై.. భారీ స్థాయిలో ఒకే ఖండంగా మారే అవకాశం కూడా లేకపోలేదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

# శ్రీసిటీలో 'క్రియా యూనివర్సిటీ' స్నాతకోత్సవం




శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం-2024 ఈనెల 24న కన్నులపండువగా జరిగింది. కేంద్ర మాజీ ప్రిన్సిపుల్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ కె.విజయరాఘవన్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రియా విశ్వ విద్యాలయ యూజీ, పీజీ విద్యార్థులు, ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూల్ రెండు, మూడు సంవత్సరాల ఎంబీఏ విద్యార్థులు మరియు క్రియా, చెన్నై యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులు మొత్తం 350 మందికి డిగ్రీలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయరాఘవన్ పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, విభిన్న దృక్కోణాల విద్యా ప్రాముఖ్యతను వివరించారు. నేటి ప్రపంచాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మూడు రకాల వ్యక్తులు అవసరం అన్నారు. ఇందులో ప్రతి తరగతిలో ముందు వరుసలో కూర్చుని పాఠ్యాంశాల పట్ల బాగా పట్టు సాధించేవారు, మధ్య వరుసలో కూర్చొని ఎక్కువ సమయం బయటకుచూసేవారు, చివరి వరుసలో కూర్చొని ఎక్కువ సమయం బయట గడిపేవారుగా పేర్కొన్నారు. ఇలా విభిన్న దృక్కోణాలు కలిగిన మీరంతా కష్టపడి చదువుకుని, కలిసి పనిచేస్తే భవిష్యత్తు మీదే అంటూ విద్యార్థులలో ఆయన స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, జెరూసలేంలోని హిబ్రూ యూనివర్సిటీలో హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షుల్మాన్ రెనీ లాంగ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రుక్మిణి బెనర్జీలకు వారి రంగాలలో విశేషమైన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. క్రియా యూనివర్సిటీ ఛాన్సలర్ లక్ష్మీ నారాయణన్, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఐఎఫ్ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీ కుమార్, ఎస్ఐఏఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీ దత్తా చంద్ర శోభి, రీసెర్చ్ విభాగం డీన్ ప్రొఫెసర్ శివకుమార్ శ్రీనివాసన్, ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రియా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ ఎన్.వాఘుల్‌కు నివాళులర్పించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు మాట్లాడుతూ, ఆశాజనక భవిష్యత్తు కోసం వాఘుల్ నాయకత్వంలో క్రియా స్థాపించబడిందని, నేడాయన లేకున్నా వారనుకున్న లక్ష్యం నెరవేరిందన్నారు. సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనే మన సత్తాతో పాటు సంకల్పం, నైపుణ్యాలు, వనరులు కలిగిన రానున్న తరాల నాయకులను పెంపొందించడం తమ విద్యా విధానం విశిష్టతగా ఆమె అభివర్ణించారు. విద్యార్థుల ఉత్తీర్ణతతో పాటు ప్రపంచ వ్యాప్త పరిజ్ఞానానికి, వివిధ సమస్యల పరిష్కారం కనుగొనేందుకు ధీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్రియా ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

# ప్రజల రుణం తీర్చుకుంటా - ఎమ్మెల్యే పాశం



తనపై నమ్మకంతో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి ఈనెల 24న తొలిసారి గూడూరు రావడంతో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించి, ఆర్టీసీ డిపో నుంచి గమళ్లపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ తన విజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, పులిమి శ్రీనివాసులు, వాటంబేటి శివకుమార్ పాల్గొన్నారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## తిరుపతి ఎస్పీ రాక




తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఇటీవల సిటీని సందర్శించారు. మొట్టమొదటిసారిగా శ్రీసిటీకి వచ్చిన ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు అక్కడ అనుసరిస్తున్న భద్రతా విధానాలను వివరించారు. శ్రీసిటీ ప్రాంతం ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దులో ఉన్నందున, డ్రగ్స్ రవాణా, అక్రమ మద్యం తరలింపు, స్మగ్లింగ్ వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు ఆస్కారం ఉందంటూ డాక్టర్ సన్నారెడ్డి ఎస్పీకి వివరించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, విదేశీ ప్రతినిధులు అధికసంఖ్యలో ఉన్న శ్రీసిటీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎస్పీ శ్రీసిటీ పరిసరాలను పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి శాంతిభద్రతలపై సమీక్షించారు. శ్రీసిటీ డీఎస్పీ జివిఎస్ పైడేశ్వరరావు, సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్, శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం జనరల్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిన కమలకుమారి



చిల్లకూరు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న అనంత రాజు కమలకుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు జాన్ పీటర్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్.కోదండరామ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలకుమారి, ఆమె భర్త డి.బి.శ్రీనివాస్‌లు విద్యార్థులకు చేసిన సహాయ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. నీటి వసతి, మైక్ వితరణ, పుస్తకాల వితరణ తదితర సేవా కార్యక్రమాలు చేసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆమె విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారని వారు కొనియాడారు. కమలకుమారి దంపతులను గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులు అనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, నరసింహన్, రాజేశ్వరీదేవి తదితరులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఎస్.శంకరయ్య, మల్లిఖార్జున్, చంద్రయ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.






## జక్కంరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం గూడూరు డీఎస్ఆర్ కమ్యూనిటీ ఆడిటోరియంలో బీటెక్ విద్యార్థి వైద్య ఖర్చులకు లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి 40వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓజిలి మండలం పెద్ద పరియ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుస్సారెడ్డి రేవంత్ రెడ్డి ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి పడిపోయి, వెన్నుముక దెబ్బతిందని, ఆ విద్యార్థి వైద్యం కోసం లయన్స్ క్లబ్ తరపున 20వేలు, సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 20వేల దాతృత్వం కలిపి 40 వేల రూపాయలను రేవంత్‌రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డికి అందించామన్నారు. జక్కంరెడ్డి ఔదార్యం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్‌రావు తదితరులు బీటెక్ విద్యార్థి రేవంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శ్రీసిటీని సందర్శించిన సిఐఐ సభ్యుల బృందం



విజయవాడ జోన్‌కు చెందిన 16మంది భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) సభ్యుల బృందం ఇటీవల రెండురోజుల పాటు శ్రీసిటీని సందర్శించింది. అక్కడ పరిశ్రమలలోని సాంకేతిక నైపుణ్యాలను అధ్యయనం చేసింది. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ఈ బృందానికి సీఐఐ విజయవాడ జోన్ ఛైర్మన్ డీవీ రవీంద్రనాథ్, వైస్ ఛైర్మన్ డాక్టర్ వి.నాగలక్ష్మి నేతృత్వం వహించారు. రాష్ట్రంలో సిఐఐ సభ్యత్వం కలిగిన వివిధ పరిశ్రమలకు చెందిన అధికారులు ఈ సందర్శనలో పాల్గొన్నారు.

## ఘనంగా..యోగా దినోత్సవం

10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శ్రీసిటీలో ఇటీవల ఉత్సాహంగా యోగా దినోత్సవం నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన యోగా కార్యక్రమంలో సుమారు 250 మంది పాల్గొన్నారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కోదండం ముఖ్యఅతిథిగా విచ్చేసి, కార్యక్రమంలో పాల్గొన్న వారికి సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, యోగా ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమూల్య బహుమతి అని పేర్కొన్నారు. దైనందిక జీవితంలో యోగాను ఒక భాగం చేసుకొని, మంచి ఆరోగ్యం, చక్కని మానవ సంబంధాలు, మంచి ఆలోచనలను పొందాలని సూచించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ ఈ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ధర్మాన్ని పరిరక్షించడం మన బాధ్యత

## రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది తప్పని సరిగా విధులను ధర్మబద్ధంగా నిర్వహిస్తూ, ధర్మాన్ని పరిరక్షించాలని, ధర్మాన్ని కాపాడితే ధర్మమే మనల్ని కాపాడుతుందని, హిందూ ధర్మాన్ని కాపాడడమే దేవాదాయశాఖ బాధ్యత అని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన ఇటీవల వేదపండితుల ఆశీర్వచనాలతో, అధికారుల సమక్షంలో దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాదాయశాఖలో పని చేస్తున్నవారంతా నిబద్ధతతో పనిచేయాలని, హంగులు ఆర్భాటాలకు పోకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. దేవాలయాల ప్రక్షాళన కార్యక్రమాన్ని మొదట తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 26వేలకు పైగానే ఆలయాలు, పాలకవర్గాలు ఉన్నాయని, అనేక ఆలయాలకు ఆస్తులు ఉన్నాయని, కానీ కొన్ని ఆలయాల్లో నేటికీ దేవుడికి దీపం పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి దేవాలయాలన్నిటిలో ధూపదీప నైవేద్య కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి నాయకత్వంలో ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న వాటిని మొదలుపెట్టాలని నిర్ణయించామన్నారు. దేవాలయాల పునరుద్ధరణ పనులకు అనేకమంది దాతలు ముందుకు వస్తున్నారని, పూర్తిస్థాయిలో పర్యవేక్షించిన తర్వాత వాటికి అనుమతిస్తామన్నారు. భవిష్యత్తులో అన్ని కార్యక్రమాలను ఆగమశాస్త్రబద్ధంగా, నియమబద్ధంగా చేసేందుకు కమిటీ ఏర్పాటుచేస్తామన్నారు. ఆలయాల కమిటీ కాలపరిమితి ప్రకారం కొత్తవాటి నియామకానికి చర్యలు తీసుకుంటామని, అన్ని ఆలయాల్లో పవిత్రతను కాపాడేలా చర్యలుంటాయని చెప్పారు. ఆలయాలకు సంబంధించిన భూములను కాపాడేందుకు, ఆక్రమణలకు గురైన భూములను తిరిగి దేవాదాయశాఖకు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### ధూప దీప నైవేద్య పథకానికి ప్రతిపాదనలు :

ఆలయాల్లోని అర్చకులకు సంబంధించి తమ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ధూప దీప నైవేద్యం పథకం ఒకటని, సంవత్సరానికి రూ. 50వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకు రూ. 5వేలు పారితోషికం ఉందని, తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని రూ. 10వేలకు పెంచేందుకు (పారితోషికం రూ. 7వేలు, పడితరం రూ. 3వేలు) వంతున చెల్లించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపామని, ఆ మొత్తాన్ని సర్వశ్రేయో నిధి నుండి చెల్లించడం జరుగుతుందని మంత్రి ఆనం ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా, దేవాలయాల్లో జరిగే పునరుద్ధరణ పనులు, సత్రాలు, ఇతర కట్టడాల విషయంలో నిర్మాణాలు శాస్త్రబద్ధంగా, వాస్తునియమాలతో ఉండేలా పర్యవేక్షించేందుకు తగు సిఫార్సు చేయడం కోసం దేవాదాయశాఖ సీనియర్ అధికారులతో, ఇంజనీరింగ్ అధికారులతో ఒక కమిటీని నియమించడం జరుగుతుందని, ఆ మేరకు అనుమతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అదనపు కమిషనర్లు టి.చంద్రకుమార్, కె.రామచంద్రమోహన్, చీఫ్ ఇంజనీర్ సుసర్ల శ్రీనివారావు, జాయింట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్, ఉప కమిషనర్ ఎం.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో యోగాసనాలు



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరానికి హాజరైన 640 మంది విద్యార్థులు, మరో 50 మంది యోగాక్లబ్ విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఎన్‌సిసి అధికారులు పాల్గొన్నారు. ఎన్‌సిసి నావెల్ 10(ఏ) యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ గణేశ్ గోదావె ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ రామభాగ్య, కుమారి వినీత విద్యార్థులతో యోగాసనాలు సాధన చేయించారు. ఎన్‌సిసి అధికారులు డా.వి మల్లికార్జున్‌రెడ్డి, జి.నరేంద్రబాబు, పెంచలరెడ్డి, కొండారెడ్డి, మస్తానయ్య, సివి నాగరాజు, లక్ష్మీనారాయణ, గోవిందు, ఎన్‌సిసి యూనిట్ ప్రతినిధులు అరుణ్ శర్మ, సూరజ్ బగేల్, నీలేష్ కుమార్, అనిల్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## జానకిరామ.. రామాయణం (19)

- ఊటుకూరు జానకి రామారావు



ప్రక్కనే వున్న ప్రాణాధికుడయిన తమ్ముడు లక్ష్మణుని చూసి, లక్ష్మణా ఈ రాజ్యం నీది, ఈ రాజ్యపాలన బాధ్యత నీకోసమే నేనంగీకరించాను. నీ కిష్టమైన భోగాలు, సుఖాలు అన్నీ ఆనందంగా అనుభవించు! అని పలికి రాముడు భార్యతో కూడి దీక్ష స్వీకరించటానికి తన మందిరానికి వెళ్ళిపోయాడు.

శ్రీరాముని మందిరానికి రాజు కోరిక మీద వశిష్ఠుడు విచ్చేశాడు.

రాముని చేత దీక్షాస్వీకారం ఏ విధమైన లోటుపాట్లు లేకుండా జరగాలని దశరథుడి కోరిక.

అనుకోని అతిథి ఆగమనానికి తొందరతొందరగా తొట్రుపడుతూ వెళ్ళి ఆహ్వానించి ఆయనకు తగిన మర్యాదలు జరిపాడు రాముడు.

వశిష్ఠులవారు రాముని చూసి నాయనా నీవూ, సీతా ఈరోజు ఉపవాసదీక్షలో ఉండి దర్భలమీదనే విశ్రమించాలి.

రేపు ప్రాతఃకాల ముహూర్తమందు నీకు పట్టాభిషేకం జరుగగలదు అని పలికి వైదేహీసహితుడయిన రామునికి మంత్రపూర్వకంగా ఉపవాసం చేయించాడు.

ఈ వార్త అప్పుడే నగరమంతా వ్యాపించింది!

ఎవరికి వారు తమకే పట్టాభిషేకం అన్నట్లుగా కేరింతలు, తుళ్ళింతలు.

వీధులలో ఉత్సవాలు! అయోధ్యానగరవాసుల సంబరాలు అంబరాన్ని చుంబించాయి. అన్ని దారులు రాముడి ఇంటివైపే దౌడుతీశాయి.

ఎవరినోట విన్నా ఇవే ముచ్చట్లు,

రాబోయే అద్భుతమైన రోజులగూర్చి ఇప్పుడే కలలు!

ఆ కలలను గురించిన కబుర్లు!.

రాముడి మందిరం కోలాహంగా ఉంది!

స్వచ్ఛమైన నీటితోనిండిన ఒక సరస్సులో వేలకొద్దీ పద్మాలు విచ్చుకుంటే చూపరులకు ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో రాముని భవనంలోకి వచ్చిపోయే పురజనుల ముఖపద్మాలు విచ్చుకొని అంత ఆహ్లాదకరంగా ఉన్నదట!

జనులందరి మదిలో ఒకటే చింత!

ఇంకా తెలవారదేమి? ఈ చీకటి విడిపోదేమీ! ఎవరికీ నిద్దురలేదు...

తెల్లవారగనే తమ రాజు రాముడు! ఈ భావనే వారి మదిలో బ్రహ్మానందాన్ని కలుగజేసింది!.

రాముని గృహం నుండి వచ్చిన వశిష్ట మహర్షిని చూసి దశరథుడు అన్నీ అనుకున్నట్లుగా సవ్యంగానే జరుగుతున్నవిగదా! అని ప్రశ్నించి తెలుసుకొని, సభ చాలించి, సింహం గుహలో అడుగుపెడుతున్న విధంగా అంతఃపుర ప్రవేశం చేశాడు.

ఆ రాత్రి రామచంద్రుడు సీతతో కలసి హోమం చేసి మిగిలిన హవిస్సు భక్షించి నారాయణుని ధ్యానిస్తూ అత్యంత మనోహరంగా అలంకరించిన మహావిష్ణువు ఆలయ ప్రాంగణంలో పరచిన దర్భలమీద సీతతో కూడ శయనించాడు!

నాల్గవ ఝామునే మేల్కొని మరల యథావిధిగా చేయవలసిన కార్యక్రమాలన్నీ చేసి ప్రశాంతచిత్తుడైవున్నాడు.

నగరం అంతా పౌరులు అలంకరించి శ్రీరామాభిషేక ఘడియల కోసం ఎదురుచూస్తున్నారు. వీధులలో జనఘోష సముద్రఘోషను తలపిస్తోంది.

పుట్టినప్పటినుండీ కైకతో కలిసిపెరిగిన దాసి ఒకతి! ఆవిడ పేరు మంథర. ఆరోజు రాజప్రాసాదంపైకి ఎక్కింది! మంథరకు కోలాహలంగా ఉండి చక్కగా అలంకరింపబడిన రాజవీధులు కనపడ్డాయి! జనులందరూ తలస్నానం చేసి కొత్తబట్టలు ధరించి ఉన్నారు. ఎటు చూసినా మంగళ వాద్యాల హోరు, వేదఘోష, మంత్రపఠనం, అశ్వముల జోరు, గజముల హుషారు, ఎవరి ముఖంలో చూసినా సంతోషం కనపడ్డాయి!

అటు కళ్ళు తిప్పి చూసింది.. కౌసల్య మందిరం ముందు జనులు బారులు తీరి ఉన్నారు. అక్కడ సమృద్ధిగా దానధర్మాలు జరుగుతున్నాయి!

తన ప్రక్కనే వున్న మరొక దాదిని అడిగింది ఏమిటి నగరంలో ఈ రోజు పండుగవాతావరణం ఉన్నదేమిటి? అని.

అప్పుడు ఆ దాది ఇలా చెప్పింది,“నేడు రామునికి పట్టాభిషేకం”.

ఆ మాటలు ఒక్కసారి మంథర చెవిన పడగానే భృకుటి ముడివడింది, కళ్ళలో ఎర్రజీరలువచ్చి రుసరుసలాడుతూ విసవిసా మెట్లుదిగి, అప్పటికింకా నిద్రలేవని కైకను తట్టి లేపింది!

పైపైకి ఆపదలు వచ్చి పడుతున్నా ఇంత తెలివితక్కువగా ఇంకా నిద్రపోతున్నావా! మూఢురాలా లే! నిద్దురలే!

**ఉత్తిష్ఠ మూఢే కిం శేషే భయం త్వామభివర్తతే!..**

భర్తప్రేమకు నేనే ఎక్కువపాత్రురాలినని మురిసిపోతుంటావుగా ఇప్పుడేం జరిగిందో చూడు!

నీ సౌభాగ్యం మండినట్లే ఉంది! అది ఎండాకాలంలో ఎండిపోయిన నది!.

ఏమయ్యిందే నీకు ఇవ్వాళ? ఇట్లా గావుకేకలు పెడుతున్నావు?

అని అడిగింది కైక..

పడుకొన్నావా హాయిగా! ఊయలమీద ఊగుతూ కన్నులు తెరువకుండా ఇంకా నిద్దురలోనేవున్నావా నీవు! బయట ఏమి జరుగుతుందో తెలిస్తే నీ మత్తు పటాపంచలవుతుంది! నీ గుండె చెరువవుతుంది.

జగతికంతా నీ సవతి కొడుకే రాజు కాబోతున్నాడు, నీ పతి వలన నీకు పట్టిన గతి తెలియకున్నావు నీవు.

దశరథుడు నాకేస్వంతమని పగటికలలు కంటున్నావు! కొంగుకు కట్టేసుకున్నాని భ్రమపడ్డావు! ఒడిలోదూరిన పాము అని తెలుసుకోలేక పోయావు! ఎంత అమాయకురాలివమ్మా నీవు!.

సవతి లీల నీకస్సలు తెలియకపాయె! ఎంత గడుసుదమ్మా నీ సవతి! భాగ్యమంతా నాదే అని నీవు కలగంటున్నావు, మొగుడికి వలవేసి అంతా తానే లాక్కుంది!

ఏమిటే ! ఏమయ్యిందే ఇప్పుడు అంత కొంపలేమి మునిగిపోయినవని ఈ కేకలు పొద్దున్నే! అని అడిగింది కైక.

నీ సవతి కొడుకుకు తెల్లవారగనే పట్టాభిషేకమట! రాముడే ఇక నుంచి రాజట!

ఈ మాట పూర్తిచేసిందో లేదో! కైక ఒక్కసారి పట్టరాని ఆనందంతో చెంగున దూకి అబ్బ ఎంత మంచి వార్త చెప్పావే మంథరా! నీ జీవితంలో ఇంతకంటే మంచివార్త నాకు ఇకముందు చెప్పలేవు! అంతకు మునుపెప్పుడూ కూడా ఇంత మంచి వార్త నాకు చెప్పలేదు!

ఇదిగో ఇంత తీయని, కమ్మని వార్త నాకెరిగించినందుకు నీకు బహుమతి అని తన మెడలో హారాన్ని తీసి చేతబట్టి మంథర కీయబోయింది కైక!

కైక ఇలా చేస్తుంటే మంథరకు హృదయతాపం హెచ్చింది, కన్నులలో కోపం కనపడజొచ్చింది, మనస్సంతా పాపం నింపుకొని, ఆహా! ఇది నీకు మంచి కబురా!... నీ సవతికొడుకు రాజవ్వటం నీకు, నీ కొడుకుకూ క్షేమకరమా! ఆలోచన లేకుండా మాట్లాడుతున్నావు!

మంథరా! రాముడే వాడు! సకలగుణాభిరాముడే! సర్వలోక మనోహరుడే వాడు! నా చిన్నతండ్రేవాడు! వాడిని చూస్తే చాలునే! నన్ను నేను మరచిపోతానే, వాడు మా అందరి పుణ్యాలపంట, వాడు మా వరాలమూట! వాడిని గూర్చి ఇంకొక్క మాట మాట్లాడకే!

**రామే వా భరతే వాహం విశేషం నోపలక్షయే**

**తస్మాత్తుష్టాస్మి యద్రాజా రామం రాజ్యాభిషేక్ష్యతి!**

నాకు రాముడయినా, భరతుడయినా ఒక్కటే! తేడాలేదు! అందుకే రాజు రాముని రాజ్యాభిషిక్తుని చేస్తున్నాడంటే ఆనందం కలుగుతుంది!.

.. (సశేషం)

# ఒంటరితనమే ఓడించింది!

(మొదటిపేజీ తరువాయి)

## 2014 ఎన్నికలలో చంద్రబాబుకి..

- పదేళ్ళు ప్రతిపక్షంలో ఉన్నామన్న బాధ ఉండేది.
- ఓటుకి నోటు కేసులో ఇరుక్కుంటామేమోనన్న భయం ఉండేది.
- ఈసారి రాకపోతే రాజకీయంగా తన అడ్రస్ గల్లంతవుతుందేమో అన్న సంకోచం ఉండేది.
- అందుకోసం అప్పటి గెలుపుని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు.
- బీజేపీ, జనసేనల సహకారం ఉన్నప్పటికీ ఆ ఎన్నికలలో బాబు కేవలం 108 సీట్లు మాత్రమే సాధించి అధికారంలోకి వచ్చారు.

## కొత్త రాష్ట్రంలో తొలి ఎన్నికలు!

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రం నుండి విడిపోయాక 2014లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. డాక్టర్ రాజశేఖరరెడ్డి చనిపోయాక తెలుగు రాష్ట్రాలలో జరిగిన తొలి ఎన్నికలు అవి. అప్పటికే రాజశేఖరరెడ్డి వారసుడు జగన్ ఓదార్పు యాత్ర పేరుతో జనంలోకి వెళ్లి తనకి సానుభూతిని తెచ్చుకునే పనిలో రాష్ట్రమంతా కలియ తిరుగుతూ కావలసినంత, అంటే ఎన్నికలలో సులభంగా గెలిచేంత ఇమేజ్‌ని తన సొంతం చేసుకున్నారు.

అప్పటికి పదేళ్ళుగా, 2004 నుండి 2014 వరకు ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ చాణుక్యుడు, అపర మేధావి చంద్రబాబు 2014 ఎన్నికలని చావో రేవో అన్నట్లుగా తీసుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై వస్తున్న సానుభూతిని, రాజశేఖరరెడ్డి పైనున్న అభిమానాన్ని కాదని జనం తనని గెలిపించడం అసాధ్యం అని బాబు ముందే పసికట్టారు. పైగా జగన్ రాజకీయాలకి కొత్తవాడు, యువకుడు, రాజశేఖరరెడ్డి కొడుకు కాబట్టి జనం జగన్‌ని ఆదరిస్తారని ఊహించారు. తాను ఒంటరిగా పోటీచేస్తే ఓటమి తథ్యం అని ఆలోచించారు, ఆ పరిస్థితులని దృష్టిలో పెట్టుకుని 2014 ఎన్నికలలో ఆయన బీజేపీ, జనసేన పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో దిగారు. అపార సానుభూతి ఉన్న జగన్‌ని ఎదుర్కోవాలంటే కలిసి పోరాడితేనే విజయం సాధించగలమన్న ముందుచూపుతో బాబు చేసిన ప్రయత్నం, ప్రయోగం ఆ ఎన్నికలలో ఫలించింది. తెలుగుదేశం, దాని మిత్రపక్షాన్ని గెలిపించి చంద్రబాబునాయుడికి కొద్ది మెజారిటీతో పట్టంకట్టి పెత్తనం అప్పజెప్పారు ఆంధ్రా జనం.

## 2019 నాటికి సీన్ మారింది..

- జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్ర ప్రజల్లో ఆయనపై నమ్మకం కలిగించింది.
- ఆయనకి తోడుగా నీడగా ఆయన కుటుంబం నిలిచింది.
- రెడ్డి సామాజిక వర్గం మొత్తం ఆయన వెంటే నడిచింది.
- రాజశేఖరరెడ్డి అనుచర గణం జగన్‌కే జై కొట్టింది.
- స్వతహాగానే అధికారపార్టీపై వచ్చే ప్రతికూలత జగన్‌కి కలిసొచ్చింది.
- తనకి ఒక్క అవకాశం ఇవ్వమని జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి జనం మనసుని తాకింది.
- నేను జగనన్న వదిలిన బాణాన్ని, 'బై బై బాబూ' అంటూ ఆయన సోదరి షర్మిల చేసిన ప్రచారం ప్రజల్లోకి పాకింది.
- వీటన్నిటికీ తోడుగా అప్పటివరకూ అధికారంలో వున్న చంద్రబాబు పరిపాలనపై ప్రజలలో అసంతృప్తి మొదలయ్యింది.
- ఆ ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన విడివిడిగా పోటీచేయడం వైసీపీకి కలిసొచ్చింది.
- ఫలితంగా ఆ ఎన్నికలలో జగన్ పార్టీ వైసీపీ 151 సీట్లతో అధికారంలోకి వచ్చింది.

## 2024 నాటికి సీన్ రివర్సయ్యింది!

- తమ పార్టీ 151 సీట్లతో గెలిచిందన్న గర్వం ఆ పార్టీ లీడర్ల నెత్తికెక్కింది.
- జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్ల పాలన అరాచక పర్వంగా సాగింది.
- జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం మొత్తం ఆయనకి దూరమయ్యింది.
- సొంత సామాజికవర్గంలో జగన్‌పై అసంతృప్తి పెరిగిపోయింది.
- ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియా రాష్ట్రంలో రాజ్యమేలింది.
- పెత్తనమంతా ఆ నలుగురిదే అన్నట్లుగా జగన్ పాలన సాగింది.
- 2024 ఎన్నికల నాటికి 90 శాతానికి పైగా ఉద్యోగులు జగన్‌తో లేరు.
- మందు తాగేవాళ్ళు, అమ్మేవాళ్ళు జగన్‌తో లేరు.
- ఇసుక అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు ఇద్దరూ జగన్‌తో లేరు.
- అంగన్‌వాడీలు జగన్‌తో లేరు.
- ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు జగన్‌తో లేరు.
- చిన్న పత్రికల నిర్వాహకులు ఎవ్వరూ జగన్‌తో లేరు.
- రాజశేఖరరెడ్డి అనుచర గణం మొత్తం జగన్‌తో లేరు.
- జగన్ పార్టీలో నిజాయితీపరులుగా గుర్తింపు పొందిన నాయకులెవ్వరూ, 2024 ఎన్నికల నాటికి జగన్ పార్టీలో లేరు.
- చెప్పుడు మాటలు, అపరిపక్వ నిర్ణయాలు, మితిమీరిన ఆత్మవిశ్వాసంతో జగనే వారందరినీ దూరం చేసుకున్నారు.
- జగన్ అసమర్థతని చంద్రబాబు అందిపుచ్చుకున్నారు.
- తాను ఒక్కడినైనా జగన్‌ని ఎదుర్కొనగలనన్న ధీమా ఆయన కనపరచలేదు.
- తనకున్న రాజకీయ అనుభవాన్ని, చాణిక్యతని ప్రదర్శించారు.
- కమలంతో కలిశారు... జనసేనని కలుపుకున్నారు... తాను సైతం ఊహించని భారీ విజయాన్ని చంద్రబాబు తన సొంతం చేసుకున్నారు.

## తనని తానే సమీక్ష చేసుకోవాలి!

తానెందుకు ఓడిపోయాను? తానిచ్చిన డబ్బులేమయ్యాయి? తన అక్కాచెల్లెళ్లు, అవ్వా తాతలు ఎటు వెళ్లారు? ఇలాంటి అనవసరమైన ప్రశ్నలు తనని తానే వేసుకుంటూ సమీక్షలతో, సమావేశాలతో కాలక్షేపం చేస్తున్నారు ఆంధ్రా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్.

ఇలా అర్థంలేని ఆలోచనతో కాలయాపన చేసే ముందు ఆయన తనని తాను సమీక్ష చేసుకోవాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

2019లో ఊహించని స్థాయిలో తనకి 151 సీట్లు రావడంతో ప్రజలు తనను పూర్తిగా నమ్మారని జగన్ భావించారు. ఇదే సమయంలో కేవలం 23 సీట్లకే పరిమితం చేసిన చంద్రబాబుని జనం ఇక మళ్ళీ నమ్మరన్న ధీమా కూడా జగన్‌లో ఏర్పడిందంటున్నారు విశ్లేషకులు.

ఆ ధైర్యంతోనే ఆయన రాష్ట్రాన్ని తన సొంతం చేసుకోవాలనుకున్నారు. తన పాలనలో కార్పొరేట్ వ్యవస్థని అమలు చేశారు. అంబానీలు, అదానీలు, టాటాలు, బిర్లాలు తమ వ్యాపార సామ్రాజ్యాలని నడిపించినట్లుగా రాష్ట్రాన్ని నడిపించాలనుకున్నారు. రాష్ట్ర భవిష్యత్తుని సజ్జల, సాయిరెడ్డి, మిథున్‌రెడ్డి లాంటి వాళ్లకి అప్పజెప్పారు. తాను మాత్రం అద్దాల మేడలో కూర్చుని అప్పుడప్పుడూ బయటకొచ్చి బటన్ నొక్కి మళ్ళీ లోపల దాక్కొనేవారు. తన కోసం కష్టపడిన పార్టీ క్యాడర్‌ని జగన్ కలవలేదు. తన పార్టీ అభ్యర్థులుగా విజయం సాధించిన పార్లమెంటు సభ్యులని, శాసనసభ్యులని, శాసనమండలి సభ్యులని, జిల్లా పరిషత్ అధ్యక్షులని, మేయర్లని, మునిసిపల్ ఛైర్మెన్‌లని, మండల స్థాయి అధ్యక్షులని, గ్రామ సర్పంచులని ఆయన దగ్గరకి కూడా రానీయలేదు. చివరికి తన మంత్రివర్గంలోని మంత్రులు కూడా ఆయనని కలవాలంటే అంత ఈజీ కాదన్న వాతావరణాన్ని ఆయన చుట్టూ వున్నవారు కల్పించారు.

ఎన్నికల వేళ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీలు అంటూ ప్రతీ సభలోనూ ఊదరగొట్టారు. పైగా నేను మీకు డబ్బులిచ్చాను మీరు నాకు ఓట్లేయండి అని పదే పదే చెప్పి డబ్బులు తీసుకున్నవారిని అవమానించినట్లుగా మాట్లాడారు. తనకి మంచి చెప్పాలనుకున్న వారిని దగ్గరకి రానీయలేదు. పొరపాటుగా ఎవరైనా జొరబడి వెళ్లి చెప్తే.. వారికి మళ్ళీ కలిసే అవకాశమే ఇవ్వలేదు.

## ఒంటరితనమే ఓడించింది!

తన చుట్టూ ఉన్న ఆ నలుగురు తప్ప జగన్‌కి ఎవరూ మిగలలేదు. తన అమ్మా, చెల్లి, బాబాయ్ కుటుంబంతో సహా అందరూ దూరమయ్యారు. తన చుట్టూ వున్న భజన బృందానికి బయట పరిస్థితులు తెలిసినా జగన్‌కి చెప్పే ధైర్యం లేదు. చెప్తే తమకు కూడా అపాయింట్‌మెంట్ ఉండదేమో అన్న భయం బహుశా వాళ్ళ నోళ్లు కూడా నొక్కేసి ఉండొచ్చు.



తన నివాసానికి విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మను శాలువ కప్పి సత్కరిస్తున్న భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం కార్యదర్శి గుండ్రా సతీష్‌రెడ్డి

మనకి 175 గ్యారెంటీ అన్న భ్రమని జగన్‌కి కల్పించారు. నిజాలకి మసిపూసి అబద్దాలకి మెరుగులు దిద్దారు. ఫలితంగా జగన్‌మోహన్‌రెడ్డి ఘోరాతి ఘోరంగా పరాజయం పాలయ్యారు.

## పొత్తు అవసరం!

ప్రాంతీయ పార్టీలు ఒంటరిగా మనుగడ సాధించాలంటే అంత ఈజీ కాదు. ఖచ్చితంగా మరో ప్రాంతీయ పార్టీ లేదా జాతీయ పార్టీతో పొత్తు అవసరం. మన పొరుగు రాష్ట్రం తమిళనాడే అందుకు పెద్ద ఉదాహరణ. అతి పురాతన పార్టీగా ప్రజాదరణ కలిగిన డీఎంకే సైతం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఇండియా కూటమిలో చేరింది. చంద్రబాబు సైతం బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడల్లా విజయం సాధించారు. ఒంటరిగా పోటీ చేసినప్పుడల్లా ఓడిపోయారు.

ఈ ఎన్నికలలో సైతం పొత్తే చంద్రబాబుని గట్టెక్కించింది. అనూహ్యమైన విజయాన్ని కట్టబెట్టింది. "కలిసివుంటే కలదు సుఖం" అన్న సూత్రాన్ని పాటించిన ప్రాంతీయ పార్టీలే గట్టెక్కగలుగుతున్నాయనడానికి ఈ ఎన్నికలలో కూటమి గెలుపే ఉదాహరణ.

"జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది" అన్నట్లుగా తనకి కోటీ ముప్పై లక్షల మంది ఓట్లేసినా జగన్ ఒంటరిగా మిగిలిపోయారు. ఇంటా బయటా ఎక్కడా గెలవలేకపోయారు. తన సాక్షి మీడియాలా, భారతి సిమెంటులా, పవర్ ప్రాజెక్టులలా సీఈఓలని, సిబ్బందిని పెట్టి కథ నడిపిస్తే కుదరదన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. ఇప్పుడు అసెంబ్లీకి రావాలా వద్దా అన్న మీమాంసలో ఒంటరిగా నలిగిపోయారు. ప్రజాక్షేత్రంలో గెలవాలంటే ప్రజల మధ్య నిలవాలి. ప్రజలతో కలవాలి. జనంతో మమేకం కావాలి. అప్పుడే ఎవరైనా ప్రజా నాయకులు కాగలరు. గెలిచేవరకూ ప్రజల మధ్యే తిరుగుతూ, వాళ్ళ గడపలు వద్ద మెదులుతూ, వాళ్ళ బుగ్గలు నిమిరి ముద్దులు పెట్టి.. తీరా గెలిచాక ప్యాలెస్‌లకి పరిమితమైతే జనం స్వాగతించరు. అన్నీ గమనించి తమకి అవకాశం వచ్చినప్పుడు తమ సత్తా చూపిస్తారు. గడప దాటని నాయకులని పూర్తిగా ఇంటికే పరిమితం చేస్తారు. ఇది తెలుసుకున్నవారెవరైనా మేలుకుంటే కోలుకుంటారు!



### 'కెన్సస్' నరసారెడ్డి మాతృమూర్తి

# కొండ్లపూడి శేషమ్మ కాలధర్మం

చెన్నై నగరంలోని ప్రముఖ నిర్మాణ సంస్థ 'కెన్సస్' అధినేత కొండ్లపూడి నరసారెడ్డి తల్లి కొండ్లపూడి శేషమ్మ జూన్ 22వ తేదీ శనివారం కన్నుమూశారు. హైదరాబాదులోని తన చిన్న కుమారుడు సుధాకరరెడ్డి నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు.

నెల్లూరు గ్రామీణ ప్రాంతంలోని కల్లూరుపల్లిలో పేరుమోసిన భూస్వామ్య కుటుంబం కొండ్లపూడివారిది. కీర్తిశేషులు కొండ్లపూడి ముద్దుకృష్ణారెడ్డి సతీమణి శేషమ్మ. ఆ దంపతులకి ముగ్గురు సంతానం. నరసారెడ్డి పెద్దవాడు కాగా ఆయనకి తమ్ముడు సుధాకరరెడ్డి, చెల్లెలు ఝాన్సీ ఉన్నారు. ఆమె చిన్న కుమారుడు సుధాకరరెడ్డి కాంట్రాక్టర్‌గా హైదరాబాదులో స్థిరపడ్డారు.

శేషమ్మ ఆధ్యాత్మికతత్వపరురాలు. దైవభక్తితో పాటు సామాజికస్పృహ కూడా ఎక్కువ. రైతు కుటుంబం నుండి వచ్చిన కారణంగా కష్టపడి పనిచేయడమంటే ఆమెకి ఇష్టం. ఉన్నత స్థాయిని చేరిన తన బిడ్డల అభ్యున్నతిని, మనుమళ్ళు, మనుమరాళ్ళు, మునిమనవలు, మునిమనుమరాళ్ళని చూసుకుని సంతృప్తికరమైన పరిపూర్ణ జీవితం సాగించి, తన 95వ ఏట ఆమె దైవసాన్నిధ్యం పొందారు.

శేషమ్మ ఆత్మకి సద్గతి ప్రాప్తించాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# అవాక్కయ్యారా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల సమస్యలు చర్చించుకోవడానికి పక్కా అసెంబ్లీ భవనం లేదు. మంత్రులకి శాశ్వత క్యాంపు కార్యాలయాలు లేవు. శాసనసభ్యులకి క్వార్టర్స్ లేవు. ప్రభుత్వ విభాగాలకి సొంత కార్యాలయాలు లేవు. అధికారులకి నివాస భవనాలు లేవు. వీటన్నింటినీ మించి రాష్ట్రం విడిపోయి పదేళ్ళయితే ఇప్పటివరకూ రాజధానికే గతి లేదు. కానీ... 26 జిల్లాలలో, సుమారు 677 కోట్ల రూపాయల విలువచేసే 42 ఎకరాల ప్రభుత్వ భూములలో వైసీపీ కార్యాలయాల నిర్మాణానికి మాత్రం వైసీపీ పెద్దలు శరవేగంగా అడుగులు వేశారు. ఒక్కొక్క కార్యాలయం 16000 (పదహారు వేలు) చదరపు అడుగులు లేదా అంతకుమించిన వైశాల్యంలో నిర్మాణాలు ఉండేలా వాటికి రూపకల్పన చేశారు. మొత్తం అన్ని జిల్లాలలో నిర్మించే కార్యాలయాలు ఒకే తరహాగా కనిపించేలా వాటిని డిజైన్ చేశారు. మరో ముప్పై సంవత్సరాలు తామే అధికారంలో ఉంటామన్న ధీమా, ధైర్యంతో జగన్‌మోహన్‌రెడ్డి బృందం విశాఖలో రిషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనం, 26 జిల్లాలలో దాదాపుగా పూర్తి కావస్తున్న పార్టీ కార్యాలయాలు చూసి వైసీపీ శ్రేణులే అవాక్కయ్యారని ఆ పార్టీ పెద్దలే చెప్పడం విశేషం. తాము అదే పార్టీలో సభ్యులుగా వున్నా ఇంతటి భారీ నిర్మాణాల సంగతే తమకి తెలియనే తెలియదని, తమకేకాదు తొంభై శాతం మంది పార్టీ శ్రేణులకు ఎవరికీ తెలియదని వైసీపీ నేతలు చెప్తున్నారు. మొన్న రిషికొండ ప్యాలస్, ఇప్పుడు వైకాపా పార్టీ కోటలు చూసి అవాక్కయ్యామని అంటున్నారు. ఇలాంటి విషయాలన్నీ ఎన్నికలకి ముందే బయటకి పొక్కుంటే జగన్ కోరుకున్నట్లుగా మొత్తం 175 సీట్లు కూటమికే వచ్చి ఉండేవని, తమ పార్టీకి గుండు సున్నాయే మిగిలుండేదని వాపోతున్నారు!

# జిల్లాలో విద్యుత్ సమస్యలు తీర్చండి

## అధికారులకు ఎస్ఇ విజయన్ ఆదేశం

జిల్లాలో విద్యుత్ సమస్యలు తీర్చాలని జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్, పర్యవేక్షక ఇంజనీర్ వి.విజయన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 22న ఆయన జిల్లాలోని విద్యుత్‌శాఖ ఎస్ఇలు, డీఇలు, అకౌంట్స్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, విద్యుత్ అంతరాయాలు ఎక్కడున్నా సరే, వెంటనే స్పందించి వినియోగదారుల సమస్యలు తీర్చాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇందుకూరుపేట మండలం కొరుటూరు గ్రామంలో ఇటీవల విద్యుత్ లైన్‌మెన్ సురేంద్రపై జరిగిన దాడిని ఆయన ఖండిస్తూ, ప్రభుత్వోద్యోగులపై దాడి దారుణమని అన్నారు. ఆ లైన్‌మెన్‌ను తాను పరామర్శించి ధైర్యం చెప్పానన్నారు. ఉద్యోగులెవరూ అభద్రతాభావానికి లోను కావద్దని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(టెక్నికల్) శేషాద్రి పాల్గొన్నారు.

# యోగా గురువు.. ప్రసన్నకు పురస్కారం




నెల్లూరుకు చెందిన యోగామాస్టర్ ప్రసన్నకుమార్ ఉత్తమ యోగా గురువుగా తమిళనాడులో పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 23న తమిళనాడు స్పోర్ట్స్-యోగా అసోసియేషన్, మహిళా జైన్ కళాశాల వారు సంయుక్తంగా పలు రాష్ట్రాలకు చెందిన యోగా మాస్టర్‌ల సేవలను గుర్తించి పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రసన్నకు ఆ పురస్కారం లభించడం పట్ల నెల్లూరులోని పలువురు యోగామాస్టర్‌లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## 'బామా' కార్యదర్శి..

# సుధాకర్‌రెడ్డి కన్నుమూత


సుధాకర్‌రెడ్డి

### అన్న మరణం తట్టుకోలేక తమ్ముడు కూడా మృతి


శేషారెడ్డి

అన్న మరణం తట్టుకోలేక తమ్ముడు కూడా మృతిచెందాడు. ప్రాణానికి ప్రాణంగా ఉండే అన్నదమ్ములిద్దరూ మరణంలోనూ ఒకరికొకరు తోడుగా.. రెండురోజుల వ్యవధిలోనే ఈ లోకం వీడిపోవడంతో కావలి ప్రజలు కంటతడి పెట్టారు. కావలిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా 'బామా' సంస్థ పరిచయమే. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరుతో కావలిలో 'బాల సుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్-(బామా)' అనే సంస్థను ప్రారంభించి రాష్ట్రం నలుమూలల నుంచి ఎందరో విఖ్యాతులైన గాయనీ గాయకులను ఆహ్వానించి, తమ సంస్థ ద్వారా ప్రజలకు పరిచయం చేసి అందరి అభినందనలు అందుకున్న సంగీత సాంస్కృతిక కళా సంస్థ అది. ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను, వారి బృందాన్ని కూడా పలుసార్లు స్వాగతించి అద్భుతమైన బాలు గానంతో కావలి ప్రజలను అలరింపజేసిన సంస్థ అది. 'బామా' కార్యక్రమాలన్నీ నిర్వహించేది కావలికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి లేబాకుల సుధాకర్‌రెడ్డి. ఈ నేపథ్యంలో ఈనెల 23న.. ఆదివారం ఆయన గుండెపోటుతో మరణించడంతో సంగీత సాహిత్య కళాభిమానులు, కావలి ప్రజలు ఆవేదన చెందారు. 25న మంగళవారం ఆయన అంత్యక్రియలు. అన్న సుధాకర్‌రెడ్డి మృతితో తీరని ఆవేదనలో ఉన్న తమ్ముడు శేషారెడ్డి, పెద్దపెట్టున రోదిస్తూనే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ప్రాణసమానంగా ఉండే అన్న ఇక లేడనే బాధతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్సకోసం ఆయన్ను వెంటనే నెల్లూరుకు తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయంది. స్మశానంలో అన్నకు అంతిమసంస్కారాలు చేస్తున్న సమయంలోనే తమ్ముడు శేషారెడ్డి మరణించాడనే సమాచారం అందింది. కావలి ప్రజలకు సుమధుర సంగీతాన్ని అందిస్తున్న ఆ ఇద్దరూ ఒకరితర్వాత ఒకరుగా...కన్నుమూయడంతో స్థానికులు ఆవేదన చెందారు.



# యోగ సాధనతో ఎన్నో ఉపయోగాలు

## ఇతాక ఇంటర్నేషనల్ స్కూల్‌లో.. ఘనంగా యోగ దినోత్సవం

యోగ గొప్పతనాన్ని ప్రపంచం గుర్తించిన నేపథ్యంలో నైపుణ్యం ఉన్న యోగ శిక్షకులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో యోగను ఆరోగ్యం కోసమే కాకుండా, జీవనోపాధి కోసం కూడా యువత నేర్చుకోవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం, జూన్ 26న మాదక ద్రవ్యాల దుర్వినియోగం-అక్రమరవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాలను పురస్కరించుకుని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ-భారతప్రభుత్వం ఆధ్వర్యంలో, నెల్లూరులోని ఇతాకా ఇంటర్నేషనల్ స్కూల్‌లో వారం రోజుల పాటు యోగ వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యోగసాధనలో మెలకువలను బోధించారు. ఈ వారోత్సవాల ముగింపు సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కారాగారాల డెప్యూటీ సూపరింటెండెంట్ ఎస్. వెంకటేశ్వరరావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి, నెల్లూరు జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి వెల్లంకి సురేశ్, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, పతంజలి కేంద్ర జిల్లా ఇన్‌చార్జ్ బి. విజయకుమార్‌రెడ్డి, జిల్లా లోక్ అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. యోగాలో శిక్షణతో పాటు మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని వక్తలు ఈ సందర్భంగా సూచించారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ యోగ శిక్షకురాలు పద్మావతి వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం, యోగాలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఇతాకా ఇంటర్నేషనల్ స్కూల్ జి.ఎం సంగం జీవన్, ప్రిన్సిపల్ రవి కుమ్మమూరు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్..

# కిలారి వెంకటస్వామినాయుడు అస్తమయం



నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కిలారి వెంకటస్వామినాయుడు ఇక లేరు. ఈనెల 25వ తేదీ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని భక్తవత్సలనగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన స్వస్థలం..ఆత్మకూరు నియోజకవర్గం అప్పారావుపాళెం గ్రామం. తల్లితండ్రులు కిలారి వెంకటరాయులునాయుడు-పిచ్చమ్మలకు ఆయన ద్వితీయ సంతానం. కాలక్రమంలో వారు నెల్లూరులో స్థిరపడ్డారు. సోదరుడు (అన్న) కిలారి తిరుపతినాయుడు నెల్లూరు పెద్దాసుపత్రి ఎదురుగా కల్యాణమండపం నిర్వహిస్తున్నారు.

కిలారి వెంకటస్వామినాయుడు కాంట్రాక్ట్ రంగంలో ఉంటూ స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగారు. తెలుగుదేశంపార్టీలో చేరి కార్యకర్త స్థాయి నుంచి నాయకుడిగా రాణించారు. నెల్లూరు నగర అధ్యక్షుడుగా, రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పనిచేశారు. నగరంలోని భక్తవత్సలనగర్ ప్రాంతానికి కౌన్సిలర్‌గా కూడా ఉంటూ ప్రజలకు సేవలందించారు. ముక్కుసూటితనం, నిర్భీతిగా ఉండడం, ఉన్నదున్నట్లు మాట్లాడడం ఆయన నైజం. అయితే, మాట కటువుగా ఉన్నా ఆయన సరళ హృదయుడు. పార్టీలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండేవారు. కార్యకర్తలను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేశారు. జిల్లాలోనే కాక రాష్ట్రంలోని పలువురు టీడీపీ నాయకులతో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. జిల్లాలో టీడీపీ సీనియర్ నేతగా ఉన్న ఆయన్ను గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవి వరించింది. ఆ పదవిలో ఆయనెంతో నిబద్ధతతో పనిచేసి అటు పాఠకులు..ఇటు గ్రంథాలయ ఉద్యోగుల మన్ననలు అందుకున్నారు.

కిలారి వెంకటస్వామినాయుడు మృతితో జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఒక సీనియర్ నాయకుడిని కోల్పోయినట్లయింది. ఆయన మృతితో వారి కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. ఆయన మరణ సమాచారం తెలియడంతోనే రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు కిలారి మృతికి చింతిస్తూ.. ఒక ప్రకటనలో వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు.

## టూకీగా...



### అన్నారెడ్డిపాళెంలో ఆత్మారామస్వామికి రథోత్సవం

సంగం మండలం అన్నారెడ్డిపాళెంలో కొలువైవున్న శ్రీ సీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 22న స్వామివారికి అత్యంత వైభవంగా రథోత్సవం జరిగింది. ఆలయ ఇఓ ప్రసాద్‌రెడ్డి, అర్చకులు వేదగిరి సత్యనారాయణతో పాటు పులగం మల్లారెడ్డి కుటుంబ సభ్యుల ఉభయకర్తృత్వంలో జరిగిన ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### మాలకొండ స్వామికి రూ. 11.4 లక్షల రాబడి

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండపై వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి ఈనెల 22న శనివారం ఒక్కరోజులోనే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 11,40,170 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

### రాపూరులో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ మూడవసారి ఎన్నికైనందుకు సంతోషిస్తూ, తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు ఈనెల 22న పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### గోనుపల్లి జడ్పీ విద్యార్థులకు 'విద్యాకానుక'

రాపూరు మండలం గోనపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఈనెల 22న పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రకుమార్‌ల ఆధ్వర్యంలో 'విద్యాకానుక'గా యూనిఫామ్ పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వచ్చి గ్రామానికి మంచిపేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

### మినగల్లులో నీళ్లట్యాంకుల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు గ్రామంలో ఈనెల 23న తాగునీటి ట్యాంకులను పంచాయతి సెక్రటరీ పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా నీళ్ళట్యాంకులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

### జలదంకిలో పరిసరాల పరిశుభ్రత

మండల కేంద్రమైన జలదంకిలో పంచాయతి సర్పంచ్ మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో జేసీబీతో పలు ప్రాంతాల్లోని చెత్తాచెదారాన్ని, ముళ్ళ చెట్లను తొలగించి పరిశుభ్రం చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని ఆయన చెప్పారు. పంచాయతి వార్డు సభ్యుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బుజబుజనెల్లూరు విద్యార్థులకు బహుమతులు

నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరు డీవీఎన్ఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమస్థానం సాధించిన ఉమామహేశ్వరరావుకు నగదు బహుమతిని, ఉత్తమ మార్కులు పొందినవారికి ఈనెల 23న జ్ఞాపికలను బహుకరించారు. పాఠశాల వ్యవస్థాపకుడు దూడల ప్రసాద్‌రావు, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, హెడ్మాస్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

### కలిగిరిలో ఇంటింటా హిందూ ధర్మప్రచారం

మండలకేంద్రమైన కలిగిరిలో ఈనెల 22న సమరసత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలు విశిష్టమైనవని, ప్రపంచదేశాలు సైతం ఎంతగానో ప్రశంసిస్తున్నాయని, ప్రతి హిందూ కుటుంబం వాటిని ఆచరించాలని కోరారు. జిల్లా ధర్మప్రచారక్ భాస్కర్, ఆ సంస్థ ప్రతనిధులు పాల్గొన్నారు.

### సంగంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సమావేశం

సంగంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 25న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఖాజావలి వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, వాతావరణ మార్పులతో వస్తున్న డయేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# శ్రద్ధాంజలి



జననం
1929

నిర్యాణం
2024

## శ్రీమతి కొండ్లపూడి శేషమ్మ గారు

పరిపూర్ణ జీవితం సాగించి, తమ 95వ యేట..
జూన్ 22, 2024, శనివారం నాడు పరమపదించారు.

**ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తికి అశ్రునివాళి.**

కుమారుడు - కోడలు
**కొండ్లపూడి నరసారెడ్డి**
**లక్ష్మి**
మనుమడు - మనుమరాలు
సిద్ధారెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి - సాయి సంయుక్తరెడ్డి

కుమారుడు - కోడలు
**కొండ్లపూడి సుధాకర్‌రెడ్డి**
**అనిత**
మనుమలు - మనుమరాళ్ళు
కొండ్లపూడి సునిశ్చల్‌రెడ్డి - షికారెడ్డి
బోయా చరణ్‌ప్రసాద్‌రెడ్డి - సునయనరెడ్డి
మునిమనుమరాళ్ళు
కొండ్లపూడి సాయి అక్షయరెడ్డి, సాయి ఆరాధ్యరెడ్డి
బోయ ఇషిత, ఇషానా

కుమార్తె - అల్లుడు
**సోమవరపు ఝాన్సీరెడ్డి**
**లేట్ సోమవరపు రవీంద్రరెడ్డి**
మనుమలు - మనుమరాళ్ళు
వై.యస్.అనిల్‌రెడ్డి - మాలినిరెడ్డి
సోమవరపు బలరామ్‌రెడ్డి - చందనదీప్తి, I.P.S.,
మునిమనుమడు, మునిమనుమరాళ్ళు
వై.యస్.శ్రేయ, వై.యస్.సాజీవ్
సోమవరపు ఆర్యఅద్వైతారెడ్డి

### ఉత్తరక్రియలు

వారి **పెద్దకర్మ తేది. 03.07.2024 బుధవారం** ఉదయం 11.30 గంటలకి
హైదరాబాదు, జూబ్లీహిల్స్, రోడ్ నెం.10, ఇంటి నెం.156లోని
మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Scan QR Code for Residence Address

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com